సూర్య 18వ వసంతంలోకి...
visit us @ http://epaper.suryaa.com

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

శుక్రవారం | 13 సెప్టెంబర్ 2024 | విజయవాడ
సంపుటి 17 | సంచిక 283
పేజీలు 10+8 | వెల: రూ. 6.50

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi



విద్యార్థులకు దిశా నిర్దేశం...నిరుద్యోగులకు మార్గనిర్దేశకం...
APPSC,TSPSC
పోటీపరీక్షల గైడెన్స్
నిపుణులైన అధ్యాపకులతో
నాణ్యమైన మెటీరియల్
కరెంట్ అఫైర్స్
నమూనా ప్రశ్నాపత్రాలు
విద్యా ఉద్యోగ సమాచారం
'సూర్య' ఆన్‌లైన్‌ఎడిషన్ www.suryaepaper.com చూడండి.


అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయణం - వర్ష ఋతువు, భాద్రపద మాసం శుద్ధ దశమి సా.5.34, పూర్వాషాఢ సా.6.06, వర్జ్యం రా.1.59 నుంచి 3.34 వరకు
రాహుకాలం ఉ.10.30 నుంచి 12.00 వరకు దుర్ముహూర్తం ఉ.8.17 నుంచి 9.05 వరకు తిరిగి మ.12.18 నుంచి 1.07 వరకు

## నష్టపోయిన ప్రతీ
# రైతుకు పరిహారం



- బీమా లేకపోయినా పరిహారం చెల్లింపు
- రైతుల భాగస్వామ్యంతో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు
- హార్టికల్చర్, ఆక్వా పంటలకు ఫుడ్ ప్రాసెసింగ్‌కు సహకారంతో రైతులకు లబ్ది
- వ్యవసాయ ఉత్పత్తులకు ఆహార శుద్ధి ద్వారా విలువ పెంపు
- ఎంఎస్ఎంఈ, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష

## సుప్రీంకోర్ట్ చీఫ్ జస్టిస్ ఇంటిలో
## వినాయకుడి వేడుకల్లో ప్రధాని



- చెలరేగిన తీవ్ర రాజకీయ దుమారం
- జస్టిస్ డీవై చంద్రచూడ్ నివాసంలో జరిగిన గణేశ్ పూజలో పాల్గొన్న ప్రధాని మోడీ
- ఈ కలయిక ఆందోళనకర సందేశాన్ని ఇస్తోందంటున్న విపక్షాలు
- ప్రజలకు సందేహాలు కలుగుతాయన్న సంజయ్ రౌత్

## అంతరిక్షంలో తొలిసారి ప్రైవేట్ స్పేస్ వాక్



6లో

- నలుగురు వ్యోమగాములను నింగిలోకి స్పేస్ఎక్స్
- భూమి చుట్టూ చక్కర్లు కొడుతున్న డ్రాగన్ క్యాప్సుల్
- భూమికి 435 మైళ్ల దూరంలో స్పేస్ వాక్
- స్పేస్ఎక్స్ సంస్థ ప్రధాన కార్యాలయంలో సంబరాలు

## లాభాల్లో స్టాక్ మార్కెట్‌లు



5లో

- 1,500 పాయింట్లు ఎగిసిన సెన్సెక్స్
- మొదటిసారి 83 వేల మార్క్ దాటిన సెన్సెక్స్
- ఆరున్నర లక్షల కోట్లు పెరిగిన ఇన్వెస్టర్ల సంపద

## జాతీయ విపత్తులా
# గుర్తించండి

- ఉదారంగా సాయం చేయండి
- ప్రజలు భారీగా నష్టపోయారు....రైతులు కుదేలయ్యారు
- ప్రజలను తిరిగి నిలబెట్టేలా కేంద్రం సాయం చేసేలా చూడండి : వరద నష్టం అంచనాలపై వచ్చిన కేంద్ర బృందానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విన్నపం
- వరద కష్టాలపై ప్రజల్లో అసహనం, ఆవేశం కనిపించలేదు, ప్రభుత్వంపై నమ్మకం కనిపించింది

రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల కారణంగా ఊహించని విపత్తు తలెత్తి...అపార నష్టాన్ని, కష్టాన్ని కలిగించిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. కేంద్రం ప్రజలను ఆదుకునేందుకు ఉదారత చూపాలని సీఎం కోరారు. వరద నష్టాలపై అంచనాల కోసం ఏర్పాటైన కేంద్ర బృందం రాష్ట్రంలో పర్యటించింది. అనంతరం నేడు సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో సమావేశమైంది. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో వచ్చిన ఈ విపత్తును సాధారణ విపత్తులా, గతంలో వచ్చిన వరదల్లా చూడవద్దని అన్నారు.




2లో

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

## ఆధునికతతో వృత్తి నైపుణ్యాన్ని
# పెంచుకోవాలి

- అభివృద్ధి సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహనకు విస్తృత ప్రచారం చేయాలి
- ప్రభుత్వంపై వచ్చే నెగెటివ్ వార్తలపై ఆయా శాఖల ద్వారా వెంటనే వివరణ ఇవ్వాలి
- రాష్ట్ర సమాచార పౌరసంబంధాలు,గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి

ఆధునిక సాంకేతిక పరిస్థితులకు అనుగుణంగా సమాచార పౌరసంబంధాల శాఖలో పనిచేస్తు అధికారులు,ఉద్యోగులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవర్చుకుని మరింత వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించు కోవాల్సిన అవసరం ఉందని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు,గృహ నిర్మాణ శాఖామాత్యులు కొలుసు పార్థసారధి చెప్పారు.



7లో

## ఎవరినీ వదలని
# షర్మిల

- వరద ముంపుకు జగన్, బాబులే కారణం
- పది కాదు పాతిక వేలు ఇవ్వాలి



వివరాలు-7లో

## అంతా ఇంతే!




జాతీయ స్థాయి నాయకుడు కూడా స్పందించాలని మీరు చెపితే చాలు కదా

## హర్యానా అసెంబ్లీ
# రద్దు



6లో

- నోటిఫికేషన్ విడుదల చేసిన బండారు దత్తాత్రేయ
- కొత్త ప్రభుత్వం ఏర్పడే వరకు మంత్రిమండలికి తాత్కాలిక బాధ్యతలు
- అక్టోబరు 5న హర్యానాలో అసెంబ్లీ ఎన్నికలు
- అక్టోబర్ 8న ఓట్ల లెక్కింపు

## అస్తమించిన
# అరుణ కిరణం

- కడవరకు జనం కోసం
- పార్థివదేహాన్ని సైతం నలుగురికి అంకితం
- నింగికెగిసిన కమ్యూనిస్టు యోధుడు సీతారాం ఏచూరి

సీతారాం ఏచూరి.. తెలుగు వారికే కాదు.. జాతీయ రాజకీయాల్లోనూ పెద్దగా పరిచయం అక్కర్లేని పేరు ఇది. ఎర్ర జండాను పట్టుకుని ఎన్నో ప్రజా ఉద్యమాలను ముందుండి నడిపించిన నాయకుడు ఇప్పుడు మనతో లేరు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ కొద్దిరోజుల క్రితమే ఢిల్లీలోని తుదిశ్వాస విడిచారు. కమ్యూనిస్టు రాజకీయాల్లో ఏచూరి పోషించిన చురుకైన పాత్ర ఆయన్ని అనతికాలంలోనే రాష్ట్రస్థాయి నుండి జాతీయ స్థాయికి ఎదిగేలా చేసింది.



8లో

## ఇషాన్ కిషన్
# సూపర్ సెంచరీ



7లో

- ఇండియా సీ జట్టు భారీ స్కోర్ 375/5
- ఇండియా బీ టీమ్‌తో మ్యాచ్
- ఇండియా ఏ 288/8
- అర్థ సెంచరీలతో రాణించిన సామ్స్ ములానీ, తనుష్
- ఇండియా డీతో దులీప్ ట్రోఫీ మ్యాచ్

దులీప్ ట్రోఫీలో భాగంగా ఇండియా బీ టీమ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఇండియా సీ జట్టు క్రీడాకారుడు ఇషాన్ కిషన్ సెంచరీతో కదంతొక్కాడు. దీని ఫలితంగా ఇండియా సీ జట్టు భారీ స్కోర్ దిశగా పయనిస్తోంది. మరో మ్యాచ్‌లో ఇండియా ఏ, డీ జట్లు పోటీ పడ్డాయి. ఇండియా ఏ జట్టులో సామ్స్ ములానీ, తనుష్‌లు అర్ధసెంచరీలు సాధించగా ఏ జట్టు గౌరవప్రదమైన స్కోర్ చేసింది.

## రాహుల్‌కు కనీస
## అవగాహన లేదు



- ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ విసుర్లు
- దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు
- రాజ్యాంగ పదవిలో ఉండి ఇలా ప్రవర్తించడం సరికాదు
- జాతీయ ప్రయోజనాల గురించి కనీస ఆలోచన లేదు : ధన్‌ఖడ్

వివరాలు-6లో

# సీతారాం ఏచూరి నాకు ప్రియమిత్రుడు : వెంకయ్యనాయుడు

● తీవ్ర అనారోగ్యంతో కన్నుమూసిన సీతారాం ఏచూరి ● తమ మధ్య చక్కని స్నేహం వెల్లివిరిసిందన్న వెంకయ్యనాయుడు ● ఆయన మరణ వార్త దిగ్భ్రాంతి కలిగించిందని వెల్లడి



సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణంపై మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు స్పందించారు. సీతారాం ఏచూరి కమ్యూనిస్టు భావజాలానికి ప్రతినిధి అయినప్పటికీ, తమ మధ్య చక్కని స్నేహం వెల్లివిరిసిందని తెలిపారు. సీతారాం ఏచూరి తనకు ప్రియమిత్రుడు అని వెల్లడించారు. ఇద్దరం ఎప్పుడు కలిసినా జాతీయ సమస్యల గురించే మాట్లాడుకునేవాళ్లమని వెంకయ్యనాయుడు వివరించారు.

వక్తగా ఎంతో ప్రభావశీలి అని, స్పష్టత ఉన్న పార్లమెంటేరియన్ అని కొనియాడారు. ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్నారని తెలిసి, ఆయన కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నానని, కానీ అంతలోనే మరణ వార్త వినాల్సి వస్తుందని అనుకోలేదని వెంకయ్యనాయుడు విచారం వ్యక్తం చేశారు. సీతారాం ఏచూరి ఇక లేరన్న వార్త దిగ్భ్రాంతి కలిగించిందని తెలిపారు.

# నష్టపోయిన రైతుకు పరిహారం

● బీమా లేకపోయినా పరిహారం చెల్లింపు ● చంద్రబాబు కసరత్తు ● రైతుల భాగస్వామ్యంతో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు ● హార్టికల్చర్, ఆక్వా పంటలకు ఫుడ్ ప్రాసెసింగ్‌కు సహకారంతో రైతులకు లబ్ధి ● వ్యవసాయ ఉత్పత్తులకు ఆహార శుద్ధి ద్వారా విలువ పెంపు ● ఎంఎస్ఎంఈ, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : వరదల్లో నష్టపోయిన రైతులకు పరిహారం పెద్ద ఎత్తున అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పలు ప్రయత్నాలు చేస్తున్నారు. పంటలకు ఎవరెవరు బీమా చేయించుకున్నారు? ఎవరెవరు బీమా చేయించుకోలేదు? బీమా చేయించుకోకపోతే వారికి ఏవిధంగా పరిహారం అందించాలనే విషయంపై అధికారులతో సమాలోచనలు జరుపుతున్నారు. నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామని ప్రకటించారు. తాజాగా ఏపీలో పంటల బీమాకు సంబంధించి ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. ఖరీఫ్ సీజన్ లో సాగయ్యే పంటలకు బీమా అమలు చేయనున్నారు. ఆన్ లైన్ లో నమోదు చేయించుకుని ఈకేవైసీ చేయించుకోవాలి. ఇలా చేయించుకుంటేనే పంటల బీమా వర్తిస్తుంది. రైతులు త్వరపడాలని జిల్లా వ్యవసాయశాఖాధికారులు సూచిస్తున్నారు. బీమాకు దరఖాస్తు చేసుకున్న రైతులకు వరిపంట సాగుచేస్తే వారికి హెక్టారుకు రూ.లక్ష చొప్పున పరిహారం అందుతుంది. అలాగే హెక్టారు పత్తికి రూ.లక్ష, వేరుశనగ పంటకు రూ.70 వేల చొప్పున బీమా పరిహారం అందుతుంది. మూడు యూనిట్లుగా జిల్లా విభజన : బీమా కోసం జిల్లాను మూడు యూనిట్లుగా విభజించారు. గ్రామస్థాయి యూనిట్లలో వరి పంటలు, మండల స్థాయి యూనిట్లలో కంది, జొన్న, ఎండుమిర్చి, ఆముదం పంటలతోపాటు జిల్లా స్థాయి యూనిట్లలో సజ్జ, ఉల్లి, కొర్ర పంటలకు ఉచిత బీమా వర్తించనుంది. వేరుశనగ పంటకు జులై 16 నుంచి అక్టోబరు 31 వరకు, పత్తికి జులై 1 నుంచి నవంబరు 30 వరకు వాతావరణ బీమా అమలును లెక్కిస్తారు. గతేడాది ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో కొన్ని పంటలకు బీమా అమలు చేయలేదు. వీటికి కూడా ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. దీనివల్ల ఉమ్మడి కర్నూలు జిల్లాల్లోని వేరుశనగ, మిరప, వరి, పత్తి పంటలు సాగు చేసే రైతులకు లాభం కలుగుతుంది.

సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ, ఆహార శుద్ధి పరిశ్రమల శాఖపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ శాఖల్లో ఉన్న పరిస్థితులను తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఉపాధి కల్పనలో కీలకమైన ఎంఎస్ఎంఈ ల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వనుందన్నారు. అనేక సవాళ్లతో దెబ్బతిన్న ఈ రంగాన్ని సరికొత్త విధానాల ద్వారా మళ్లీ గాడిన పెడతామని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న ఎంఎస్ఎంఈ పార్కులను త్వరితగతిన పూర్తి చేసి...వసతులు, సౌకర్యాలు కల్పించి పరిశ్రమల ఏర్పాటును వేగవంతం చేస్తామన్నారు.


రైతుల భాగస్వామ్యం : రైతుల భాగస్వామ్యంతో వారే ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేసుకునే అంశంపై కసరత్తు చేయాలని సిఎం అధికారులను ఆదేశించారు. భూములు కలిగిన రైతులు, ప్రైవేటు భాగస్వామ్యంతో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల కోసం పార్క్ లు ఏర్పాటుచేసుకునే విధానాన్ని అమల్లోకి తేవాలని సూచించారు. రాజధానిలో రైతు భాగస్వామ్యంతో వారికి ఎలా లబ్ధి చేకూర్చామో...అదే తరహా విధానాన్ని ఎంఎస్ఎంఇ పార్కుల ఏర్పాటులోను అవలంభించాలన్నారు. పూణె వంటి చోట్ల ఇలాంటి విధానం అమల్లో ఉందని అధికారులు చెప్పగా....అలాంటి విధానాలను పరిశీలించి రాష్ట్రంలో మెరుగ్గా అమలు చేయాలని సిఎం అధికారులకు సూచించారు.

సరళంగా నిబంధనలు : పరిశ్రమల ఏర్పాటులో అర్థంలేని నిబంధనలు తొలగించాలని, సులభంగా అనుమతులు ఇవ్వాలని సిఎం అదేశించారు. నిర్ధేశించిన సమయంలో పరిశ్రమల ఏర్పాటుకు ఏ అధికారి అయినా, విభాగం అయినా అనుమతి ఇవ్వకపోతే....ఆటోమేటిక్ గా అనుమతులు పొందే విధానాన్ని అమల్లోకి తేవాలన్నారు. డ్వాక్రా సంఘాల వంటి వాటిని ఎంఎస్ఎంఇలతో అనుసంధానం చేయాలని...వారిని ప్రోత్సహించాలని అన్నారు. ఎప్పటి నుంచో పెండింగ్ లో ఉన్న పరిశ్రమల ఇన్సెంటివ్స్ ను ఇవ్వాల్సిన అవసరం ఉందని...దానిపై కసరత్తు చేయాలని అధికారులకు సూచించారు. ఎంఎస్ఎంఈకి క్రెడిట్ గ్యారెంటీకి రూ. 100 కోట్లు కేటాయిస్తామని సిఎం తెలిపారు. విశ్వకర్మవంటి కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా వ్యాపారులకు రుణాలు, ప్రోత్సాహకాలు, ట్రైనింగ్ అందేలా చూడాలని అన్నారు.

ఆహార శుద్ధి పరిశ్రమకు రాష్ట్రంలో అపార అవకాశాలు : రాష్ట్రంలో ఆహారశుద్ధి రంగంపై సిఎం సమీక్ష చేశారు. ఫుడ్ ప్రాసెసింగ్ కు రాష్ట్రంలో అపార అవకాశాలు, అనువైన పరిస్థితులు ఉన్నాయని ముఖ్యమంత్రి అన్నారు. హార్టికల్చర్, ఆక్వా కల్చర్ ఉత్తత్తులకు...ఆహార శుద్ధి పరిశ్రమ ద్వారా ఆదాయాలు పెరుగుతాయని సిఎం అన్నారు. రైతులు తాము పండించే పంటలకు వాళ్లే వాల్యూ ఎడిషన్ ఇచ్చుకునే పరిస్థితి కల్పించే విధంగా పాలసీ తీసుకురావాలని సిఎం అన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే పంటలకు ఎక్కువ డిమాండ్ ఉంటుందని....వాటిని ప్రోత్సహించాలని సిఎం అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగాన్ని ఎంఎస్ఎంఈలతో అనుసంధానం చేసి గ్రామాల్లో ప్రోత్సాహం ఇచ్చే విధంగా విధానాలు తీసుకురావాలని సిఎం అధికారులకు సూచించారు.

# సాధారణ విపత్తులా ఈ విపత్తును చూడకండి

● ఉదారంగా సాయం చేయండి ● ప్రజలు భారీగా నష్టపోయారు....రైతులు కుదేలయ్యారు ● ప్రజలను తిరిగి నిలబెట్టేలా కేంద్రం సాయం చేసేలా చూడండి : వరద నష్టం అంచనాలపై వచ్చిన కేంద్ర బృందానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విన్నపం ● ప్రభుత్వ సహాయక చర్యలు భేష్, ప్రజలు కుదుటపడుతున్నారు ● వరద కష్టాలపై ప్రజల్లో అసహనం, ఆవేశం కనిపించలేదు, ప్రభుత్వంపై నమ్మకం కనిపించింది : క్షేత్ర స్థాయి పర్యటన అనంతరం సీఎంతో కేంద్ర బృందం



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల కారణంగా ఊహించని విపత్తు తలెత్తి...అపార నష్టాన్ని, కష్టాన్ని కలిగించిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. కేంద్రం ప్రజలను ఆదుకునేందుకు ఉదారత చూపాలని సీఎం కోరారు. వరద నష్టాలపై అంచనాల కోసం ఏర్పాటైన కేంద్ర బృందం రాష్ట్రంలో పర్యటించింది. అనంతరం నేడు సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో సమావేశమైంది. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో వచ్చిన ఈ విపత్తును సాధారణ విపత్తులా, గతంలో వచ్చిన వరదల్లా చూడవద్దని అన్నారు. రికార్డు స్థాయి వర్షాలు, ఆకస్మిక వరదలు ప్రజల జీవితాలను అతలాకుతలం చేశాయని...కేంద్రం ఉదారంగా ఆదుకునే విధంగా చూడాలని కేంద్ర బృందాన్ని కోరారు. ప్రజల ఆస్తులకు తీవ్ర నష్టం జరిగిందని....పంటలు నీళ్లో మునిగి రైతులు కుదేలయ్యారని సీఎం అన్నారు. ప్రాణ, ఆస్థి నష్టంతో పాటు...తాగడానికి నీళ్లు, తినడానికి తిండి లేక ప్రాణభయంతో తీవ్ర క్షోభను అనుభవించారని సీఎం చెప్పారు. ప్రజలను తిరిగి నిలబెట్టేలా కేంద్రం సాయం చేసేలా చూడమని కేంద్ర బృందాన్ని కోరారు. రెండు రోజుల వ్యవధిలో 50 సెంటీమీటర్ల వర్షం కురిసింది...కృష్ణా బ్యారేజీ చరిత్రలో ఇంత పెద్ద వరద ఎప్పుడూ రాలేదు. గరిష్టంగా 11.90 లక్షల క్యూసెక్కుల వరదకు అనుగుణంగా ప్రకాశం బ్యారేజీని నిర్మించారు. మొన్న కురిసిన వర్షాల్కు 11.43 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. ఇదే ఇప్పటి వరకు రికార్డు స్థాయి వరద. కృష్ణా నదికి ఒక వేళ 14 లక్షల క్యూసెక్కుల వరద వస్తే పరిస్థితి ఏంటి అనేది ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది. వరదల్లో ప్రజలు పడిన బాధలు చూసి చలించిపోయాం.... మంత్రులు, అధికారులు అంతా క్షేత్ర స్థాయిలో ఉండి పనిచేశారు. ప్రజలకు ధైర్యం ఇచ్చేందుకు విజయవాడలోనే ఉండి పనిచేశాం. కలెక్టర్ కార్యాలయాన్ని సచివాలయంలా చేసుకుని పనిచేశాం. సమస్త యంత్రాంగాన్ని రంగంలోకి దించి ప్రజలకు నమ్మకం కల్పించాం. అప్పటికప్పుడు డ్రోన్లు తెప్పించి ఆహారం సరఫరా చేశాం. సహాయక్ చర్యల కోసం కేంద్ర సాయం తీసుకున్నాం...సర్వశక్తులూ వడ్డాం. ఫైరింజన్లు పెట్టి రోడ్లు, ఇళ్లు క్లీన్ చేశాం. ముఖ్యమంత్రి నుంచి చిన్న ఉద్యోగి వరకు క్షేత్ర స్థాయిలో ఉండి వరద సహాయక చర్యలను యుద్ధంలా చేపట్టాం. పెద్ద ఎత్తున పంటనష్టం జరిగింది. నష్టపోయిన కౌలురైతులకు సాయం అందేలా చూడాల్సిన అవసరం ఉంది. రోడ్లు, ఇరిగేషన్ వ్యవస్థకు తీవ్ర నష్టం జరిగింది. సర్వం కోల్పోయి కష్టాల్లో ఉన్న వరద బాధితులకు, రైతులకు మంచి ప్యాకేజీ ఇస్తే తప్ప తిరిగి కోలుకోలేరు. అందుకే సాధారణ విపత్తులా దీన్ని చూడవద్దు అని కోరుతున్నా అని సీఎం కేంద్ర బృందానికి వివరించారు.

**బాధితుల్లో ప్రభుత్వం పట్ల నమ్మకం కనిపించింది :** అనంతరం కేంద్ర బృందానికి నాయకత్వం వహించిన కేంద్ర హోంశాఖ సంయుక్త కార్యదర్శి అనిల్ సుబ్రహ్మణ్యం వరద ప్రాంతాల్లో తమ బృందం జరిపిన పర్యటనకు సంబంధించి తమ అనుభవాలను ముఖ్యమంత్రికి వివరించారు. ఇంత స్థాయి వరదలు, బాధలు అనంతరం కూడా ప్రజలు ప్రభుత్వంపై ఎంతో నమ్మకంతో ఉన్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు వారికి సాంత్వన చేకూర్చాయి. ఇంత కష్టంలోను ప్రజల్లో ఎక్కడా ప్రభుత్వం పట్ల అసంతృప్తి, ఆగ్రహం కనిపించలేదు. తమకు ప్రభుత్వం న్యాయం చేస్తుంది, సాయం చేస్తుంది అనే నమ్మకం వారిలో ఉంది. డ్రోన్ల వంటి వాటి ద్వారా ప్రభుత్వ సహాకయ చర్యలు ఎంతో వినూత్నంగా సాగాయి. భారీగా పంట నష్టం జరిగింది, మౌలిక సదుపాయాల పరంగా తీవ్రం నష్టం జరిగిందని మాకు క్షేత్ర స్థాయి పర్యటన ద్వారా తెలిసింది. బుడమేరు వరదల పై ప్రజలు తమ బాధలు చెప్పుకున్నారు. దాదావు 60 ఏళ్ల తరువాత ఇలాంటి వరదలు వచ్చాయని ప్రజలు మాతో చెప్పారు. ఈ సమస్య నుంచి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరారు అని కేంద్ర బృందం ఈ సమావేశంలో సీఎం కు తమ అనుభవాలు తెలిపింది. తమ పరిశీలనకు వచ్చిన అంశాలను కేంద్రం దృష్టికి తీసుకువెళ్లి తగు సాయం అందేలా తమ వంతు ప్రయత్నం చేస్తామని కేంద్ర బృందం అధికారులు తెలిపారు.

# కష్టతరంగా బోట్ల కటింగ్ పనులు

● బ్యారేజీ నుంచి తొలగింపునకు రూ.కోట్ల ఖర్చు ● గేట్ల వద్ద చిక్కుకుపోయిన బోట్లకి తీసేందుకు వీలు పడడం లేదు ● అందుకే వాటిని ముక్కలుగా చేసి బయటికి తీయాలని అధికారుల నిర్ణయం



అమరావతి బ్యూరో : విజయవాడలో క్రిష్ణా నదిపై ఉన్న ప్రకాశం బ్యారేజీ గేట్ల వద్ద అడ్డుపడిన భారీ బోట్లను తొలగించేందుకు నిపుణులతో కూడిన టీమ్ శ్రమిస్తోంది. దాదావు పది మందితో కూడిన డైవింగ్ టీమ్ నదిలోకి దిగి పడవలను ముక్కలుగా చేస్తున్నారు. ఆ భారీ పడవలను యథాతథంగా తొలగించేందుకు సాధ్యపడనందునే ముక్కలుగా బోట్లను కోసి తీయాలని భావించారు. కానీ, బోట్లు చాలా దృఢంగా ఉండటంతో ఉదయం నుంచి కొంతమేర మాత్రమే కట్ చేయగలిగారు. దీంతో ఈ ప్రక్రియ మరికొన్ని రోజులు పట్టే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. తొలుత బోట్లను క్రేన్ ద్వారా లిఫ్ట్ చేయాలని ప్రయత్నించినా సాధ్య పడలేదు. ఇక చేసేది లేక అధికారులు ఆ బోట్లను ముక్కలు చేసే పనిని వేగవంతం చేశారు.సెప్టెంబరు 11 మధ్యాహ్నం నుంచి పడవలను కోసే పనిని ప్రారంభించగా ఆ పనిని ఇంకా కొనసాగిస్తూనే ఉన్నారు. నేటి మధ్యాహ్నం వరకూ ఓ పడవను రెండుగా కోసే పనులు పూర్తి అవుతాయని అంటున్నారు. ఆ తర్వాత ఆ ముక్కలను భారీ క్రేన్లతో బయటకు వెలికి తీసి.. మరో రెండు పడవల కోతను మొదలుపెడతామని అధికారులు చెబుతున్నారు. భారీ పడవలు దృఢంగా ఉండటం వల్ల అవి తీసేందుకు చాలా ఆలస్యం అవుతోందని అధికారులు చెబుతున్నారు. తొలి రోజున దాదావు 50 టన్నుల చొప్పున మొత్తం 100 టన్నుల బరువు ఎత్తే రెండు భారీ క్రేన్లను ప్రకాశం బ్యారేజీ పైకి తీసుకొచ్చి పడవలను ఎత్తే ప్రయత్నం చేసినా భారీ పడవలు అస్సలు కదల్లేదు. బోటు ఖరీదు రూ.50 లక్షలుప్రకాశం బ్యారేజీ గేట్ల వద్ద చిక్కుకున్న మూడు బోట్లలో ఒక్క పడవ ఖరీదు రూ.50 లక్షల దాకా ఉంటదని అధికారులు చెబుతున్నారు. ఇంత విలువైన పడవలు తమవేనని ఎవ్వరూ ముందుకు రాకపోవడం చాలా అనుమానాలకు తావిస్తోంది. ఈ బోట్లను తొలగించేందుకు, ధ్వంసమైన కౌంటర్ వెయిట్లను ఇప్పటికే ప్రభుత్వం రూ.కోట్ల ఖర్చుతో ఏర్పాటుచేసిన సంగతి తెలిసిందే. అదే కాక, ఇప్పుడు భారీ పడవలు కత్తిరించడం, నిపుణుల టీమ్‌ను రంగంలోకి దింపడం కోసం కూడా భారీగానే ప్రభుత్వం ఖర్చు పెడుతోంది.వైసీపీ వారి బోట్లే అని టీడీపీ ఆరోపణలుప్రకాశం బ్యారేజీ వద్దకు వేగంగా కొట్టుకొచ్చి గేట్లను బలంగా ఢీకొట్టిన వ్యవహారంలో టీడీపీ నేతలు వైసీపీని నిందిస్తున్న సంగతి తెలిసిందే. వైఎస్ జగన్ మోహన్ రెడ్డే కావాలని బ్యారేజీ ధ్వంసానికి పథక రచన చేశారని సీఎం చంద్రబాబు కూడా ఆరోపిస్తున్నారు. ఆ పడవలకు వైసీపీ రంగులు వేసి ఉండడం సహా మరెన్నో ఆధారాలను కూడా టీడీపీ నేతలు బయట పెడుతున్నారు. దీనిపై ప్రస్తుతం విచారణ జరుగుతోంది.

# సీఆర్డీఏ పరిధిలో వివిధ సంస్థలకు భూ కేటాయింపులు



● భూ కేటాయింపుల పరిశీలనకు కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు ● ఆరుగురు మంత్రులతో జీవోఎం నియామకం

అమరావతి బ్యూరో: ఏపీ రాజధాని అమరావతిలో సీఆర్డీఏ పరిధిలో వివిధ సంస్థలకు భూ కేటాయి ంపులపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ నేపథ్యం లోనే సంస్థలకు జరపాల్సిన భూ కేటాయింపుల పరిశీలనకు కేబినెట్ సబ్ కమిటీని సర్కారు ఏర్పాటు చేసింది. ఆరుగురు మంత్రుల తో జీవోఎంను నియమించారు. ఈ కేబినెట్ సబ్ కమిటీలో సభ్యు లుగా మంత్రులు నారాయణ, పయ్యావుల కేశవ్, కొల్లు రవీంద్ర, గుమ్మడి సంధ్యా రాణి, కందుల దుర్గేష్, టీజీ భరత్‌లు ఉన్నారు.కేబినెట్ సబ్ కమిటీ కన్వీ నరుగా పురపాలక శాఖా కార్యదర్శి, ప్రత్యేక ఆహ్వానితు లుగా ఆయా శాఖల కార్యదర్శులు నియా మకమ య్యారు. గతంలో జరిగిన కేటాయింపులను కేబినెట్ సబ్ కమిటీ సమీక్షించనుంది. గతంలో కేటాయించిన భూమి వినియోగంపై అంచనా వేసి అవసరమైన మార్పులను కేబినెట్ సబ్ కమిటీ సూచించనుంది. ప్రపంచ స్థాయి సంస్థ లను గుర్తించి అమరావతిలో ఏర్పాటు చేసేం దుకు అవసరమైన సహకారాన్ని అందించేలా కేబినెట్ సబ్ కమిటీ సిఫార్సులు చేయనుంది.

# మంగళగిరిలో పవన్ క్యాంపు ఆఫీసు




ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మంగళగిరిలోని తన నివాసాన్ని క్యాంపు కార్యాలయంగా వినియోగించుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు చంద్రబాబు నాయుడుకి గురువారం లేఖ రాశారు. విజయవాడలో విశాలమైన భవనాన్ని (ఇరిగేషన్ భవనం) క్యాంపు కార్యాలయంగా కేటాయించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి పవన్ కల్యాణ్ కృతజ్ఞతలు తెలియచేశారు. మంగళగిరిలోని నివాసాన్ని క్యాంపు కార్యాలయంగా వినియోగించుకోనున్న క్రమంలో విజయవాడలో కేటాయించిన భవనాన్ని, ఫర్నిచర్ తో సహా వెనక్కి తీసుకోవలసిందిగా ఆ లేఖలో విజ్ఞప్తి చేశారు.

## 17 నుండి అక్టోబర్ 2 వరకు
# స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం


ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఈ నెల17 నుండి అక్టోబరు 2వ తేదీ వరకూ రాష్ట్ర వ్యాప్తంగా స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని విజయవతంగా నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమానికి సంబంధించి గురువారం రాష్ట్ర సచివాలయంలో వివిధ లైన్ డిపార్ట్మెంట్ల కార్యదర్శులతో రాష్ట్ర స్థాయి తొలి స్టీరింగ్ కమిటీ సమావేశం,జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా సిఎస్ మాట్లాడుతూ ఈ పరిశుభ్రత ప్రచార కార్యక్రమం ఈనెల 17న ప్రారంభమై పక్షం రోజుల పాటు అనగా గాందీ జయంతి అక్టోబరు 2వరకూ నిర్వహించాలని చెప్పారు.ఇందుకు సంబంధించి సన్నాహక కార్యక్రమం ఈనెల14 నుండి ప్రారంభమవుతుందన్నారు.స్వచ్ఛతా హి సేవా ప్రచారం వివిధ కార్యక్రమాల ద్వారా లక్షలాది మంది పౌరులను సమీకరించడానికి రూపొందించ బడిందని ఈప్రచారం ప్రవర్తనలో భాగంగా స్వచ్ఛతను ప్రోత్సహించడం పై ప్రజల్లో అవగాహన కలిగించాలని సిఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ చెప్పారు.రాబోయే స్వచ్ఛతా హి సేవ ప్రచారం 2024 కోసం సన్నాహకాలపై సిఎస్ అధికారులకు దిశానిర్దేసం చేశారు.రాష్ట్రవ్యాప్తంగా పరిశుభ్రత అగగాహన కార్యక్రమాలను ఈ నెల 17న నుండి ప్రారంభించి పక్షం రోజుల పాటు నిర్వహించాలన్నారు. 17 సెప్టెంబర్ నుండి అన్ని జిల్లాలు,పట్టణ స్థానిక సంస్థలు క్లీన్లీనెస్ టార్గెట్ యూనిట్ల (లు) పరివర్తనను ప్రారంభించాలని సిఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ పేర్కొన్నారు.పట్టణ మరియు గ్రామీణ ప్రాంతాల కేంద్రాల్లోను సామూహిక పరిశుభ్రత డ్రైవ్‌లను నిర్వహించాలని అన్నారు.ఈకార్యక్రమ పర్యవేక్షణకు రాష్ట్ర స్థాయిలో సిఎస్ అధ్యక్షతన రాష్ట్ర స్టీరింగ్ కమిటీ,జిల్లా స్థాయిలో జిల్లా కలక్టర్ అధ్యక్షతన జిల్లా కమిటీలు ఏర్పాటై ప్రచారాన్ని పర్యవేక్షించడానికి ఒక నోడల్ అధికారిని నియమించండ జరుగుతుందని తెలిపారు.ప్రచార కార్యకలాపాలు మరియు ఉత్తమ అభ్యాసాలను హైలైట్ చేయడానికి, పౌరులు మరియు లబ్ధిదారుల వాయిస్‌లను విస్తరించడానికి జిల్లాలు, యుఎల్‌బిలు,రాష్ట్రంలో ప్రతిరోజు అప్‌డేట్‌లు, ప్రోగ్రెస్ రిపోర్ట్‌లు, విజయాలను పోస్ట్ చేయడానికి నిరంతరం పనిచేసే ఒక వ్యవస్థను ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు.అదే విధంగా రాష్ట్ర,జిల్లా స్థాయిల్లో అన్ని శాఖలు ఈకార్యక్రమంలో చురుగ్గా పాల్గొనాలని అన్నారు.

## అంతర్జాతీయ మ్యాచ్‌ల నిర్వహణకు
# మంగళగిరి స్టేడియం సిద్ధం చేస్తాం



విజయవాడ: ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ సహకారంతో గుంటూరు జిల్లా మంగళగిరి లోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో స్పోర్ట్స్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) పేర్కొన్నారు. గురువారం మంగళగిరిలో అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అపెక్స్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్రంలో క్రికెట్ అభివృద్ధికి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నామని శివనాథ్ తెలిపారు. విశాఖలో ఉన్న అంతర్జాతీయ క్రికెట్ మైదానానికి తోడుగా మరో మైదానాన్ని నిర్మిస్తామని చెప్పారు. మంగళగిరిలోని క్రికెట్ మైదానాన్ని అంతర్జాతీయ మ్యాచ్‌ల నిర్వహణకు వీలుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. త్వరలోనే క్రికెట్ మైదానం వద్ద మౌలిక వసతుల కోసం నిధులు కేటాయించనున్నట్టు వివరించారు.

# వరద బాధితులకు విరాళాల వెల్లువ



అమరావతి :ఏపీలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా వరదలు బీభత్సం సృష్టించాయి. ఇక విజయవాడను వరదలు ముంచెత్తాయి. ఇళ్లలోకి వరద నీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ క్రమంలో వరద బాధితులకు భారీగా విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. ఏపీ సచివాలయంలో గురువారం పలువురు దాతలు సీఎం చంద్రబాబు నాయుడును కలిసి వ్యక్తిగతంగా, సంస్థల ద్వారా తమ విరాళాలు అందజేశారు. ఈ క్రమంలో వరదలతో నిర్వాసితులైన బాధితులకు ఆపన్నహస్తం అందించేందుకు పలువురు దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావడం పట్ల సీఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. రెడ్డి ల్యాబ్స్ ప్రతినిధి నారాయణ రెడ్డి రూ.5 కోట్లు, కె.ఈ.శ్యామ్ కుమార్ రూ.2 కోట్ల 30 లక్షలు, 3. పెండ్యాల అచ్యుత రామయ్య రూ.2 కోట్లు(ఆంధ్రా షుగర్స్ లిమిటెడ్), విక్రం నారాయణ రావు కుటుంబ సభ్యులు రూ.1 కోటి 55 లక్షలు, ఎం. వెంకటరామరాజు, వసుధ ఫార్మా రూ.1 కోటి, మహేశ్వరరెడ్డి (ఏ.ఎమ్.ఆర్.గ్రూప్) రూ.1 కోటి, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ రూ.50 లక్షలు, వై.వి.రామారావు(క్రెడాయ్ ఏపీ) రూ.50 లక్షలు, వెంకట్ అక్కినేని రూ.50 లక్షలు, శివశక్తి ఆగ్రోటెక్ చైర్మన్ నందిగామ శ్రీనివాసరావు, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు రూ.50 లక్షలుగా ప్రకటించారు.

## వాయుగుండం ప్రభావంతో
# ఏపీలో పలు ప్రాంతాల్లో వర్షాలు

విశాఖపట్నం : విశాఖలో వర్షం అంచనా లేదు.. వాయుగుండం ప్రభావంతో ఏపీలో పలు ప్రాంతాల్లో వర్షాలుఛత్తీస్‌ఘడ్, దానిని ఆనుకొని ఉన్న అంతర్గత ఒడిశాపై ఏర్పడిన వాయుగుండం బలపడింది. దీని ప్రభావంతో ఛత్తీస్‌ఘడ్‌తోపాటు తెలుగు రాష్ట్రాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ వాయుగుండం కారణంగా నేడు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది.ఇకపోతే బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో నేడు పలు జిల్లాలలో వర్షాలు కురుస్తాయని అటు ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ముఖ్యంగా ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాలలో అక్కడక్కడ తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.విశాఖలో ఉదయంపూట గాలి ఉష్ణోగ్రత +28...+33ఓ వరకు నమోదు అవుతుంది. వర్షం వచ్చే అవకాశం లేదు. నెరుతి నుండి గాలి 14 గంటకు కిలోమీటర్లు వేగంతో సున్నితమెన గాలి వీస్తుంది. మధ్యాహ్నం గాలి ఉష్ణోగ్రత +32...+34ఓ వరకు నమోదు అవుతుంది. ఏ విధమైన అవపాతం ఉండదు. నెరుతి నుండి గాలి 11-22 గంటకు కిలోమీటర్లు వేగంతో మితమైన గాలి వీస్తుంది.గురువారం సాయంత్రం గాలి ఉష్ణోగ్రత +30...+31ఓ కు పడిపోతుంది.

# అంతరిక్షంలో తొలిసారి ప్రైవేట్ స్పేస్‌వాక్

ఫ్లోరిడా: ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ నేతృత్వంలోని 'స్పేస్‌ఎక్స్ ' అంతరిక్ష సంస్థ చరిత్ర సృష్టించింది. తొలిసారి అంతరిక్షంలో ప్రైవేట్ స్పేస్‌వాక్ను నిర్వహించింది. 'పొలారిస్ డాన్' ప్రాజెక్టు కింద ఫాల్కన్-9 రాకెట్ ద్వారా మంగళవారం నలుగురు వ్యోమగాములను నింగిలోకి పంపిన విషయం తెలిసిందే. వ్యోమగాములతో కూడిన స్పేస్‌ఎక్స్ క్రూ డ్రాగన్ క్యాప్సుల్ ప్రస్తుతం భూమి చుట్టూ చక్కర్లు కొడుతోంది. జేర్డ్ ఇస్సాక్మన్, సారా గిల్లిలు ఒకరి తర్వాత ఒకరు క్యాప్సుల్ నుంచి బయటకు వచ్చి స్పేస్వాక్ నిర్వహించారు. స్పేస్‌ఎక్స్ తయారు చేసిన స్పేస్‌సూట్ ను పరీక్షించారు. వ్యోమగాములు స్పేస్వాక్ చేసిన మొదటి ప్రైవేట్ మిషన్ ఇదే. ఈ ప్రాజెక్టులో మొత్తం స్పేస్‌ఎక్స్ పరికరాలనే వినియోగించారు. ఈ వ్యోమనౌకలో మొత్తం నలుగురు నాన్ ప్రొఫెషనల్ వ్యోమగాములు వెళ్లారు. బిలియనీర్ ఇజాక్మాన్ ఈ ట్రిప్ కోసం ఎలన్ మస్క్ కంపెనీకి భారీగా డబ్బులు చెల్లించారు. ఈ వ్యాపారం ద్వారా బాగా ఆర్జించాలని మస్క్ ప్లానేశారు. భూమికి 435మైళ్ల దూరంలో బిలియనీర్ జేర్డ్ ఇజాక్మాన్ తో మరో ముగ్గురు స్పేస్‌వాక్‌లో పాల్గొన్నారు. నాన్ ప్రొఫెషనల్ ఆస్ట్రోనాట్ ఇజాక్మాన్.. అంతరిక్షం నుంచి భూమిని చూస్తే చాలా అద్భుతంగా ఉన్నట్లు ఇజాక్మాన్ పేర్కొన్నారు. భూమి నుంచి స్పేస్ స్టేషన్ ఉండే దూరానికి మూడు రెట్ల అధిక దూరంలోవ్యోమనౌక ఉన్నది. స్పేస్‌క్రాఫ్టు చెందిన కిటికీ ఓపెన్ కాగానే, స్పేస్‌ఎక్స్ సంస్థ ప్రధాన కార్యాలయంలో సంబరాలు మొదల య్యాయి. ఇజాక్మాన్ వాక్ తర్వాత సారా గిల్స్ కూడా స్పేస్ వాక్ లో పాల్గొన్నది.





# రష్యాతో మోడీ దౌత్యం ఫలితం 45మంది భారతీయులకు విముక్తి

● రష్యా ఆర్మీ వద్ద చిక్కుకుపోయిన భారతీయులు ● మరో 50మందిని కూడా రక్షించేందుకు ప్రయత్నాలు ● మోసపూరితంగా రష్యాకు తరలించి ఉక్రెయిన్ తో యుద్ధంలోకి దింపారు ● భారత విదేశాంగ శాఖ వెల్లడి

మాస్కో: రష్యా- ఉక్రెయిన్ ల భీకర యుద్ధం ఇంకా కొనసాగుతోంది. యుద్ధం ప్రారంభం వేళ అనూహ్య పరిస్థితుల్లో కొందరు భారతీయులు రష్యా ఆర్మీ వద్ద చిక్కుకుపోయిన సంగతి తెలిసిందే. తాజాగా అక్కడి సైన్యం 45 మంది భారతీయులకు యుద్ధభూమిని నుంచి విముక్తి కలిగించింది. ఈ విషయాన్ని విదేశాంగ మంత్రిత్వశాఖ వెల్లడించింది. ఇటీవల ప్రధాని నరేంద్ర మోడీ రష్యా పర్యటన చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఈ పరిణామం చోటు చేసుకొంది. త్వరలో వారంతా స్వదేశానికి రానున్నారు. ప్రస్తుతం యుద్ధక్షేత్రంలో ఉన్న మరో 50 మందిని కూడా రక్షించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు విదేశాంగ శాఖ తెలిపింది. గతంలో ఇరు దేశాధినేతలు మోదీ, పుతిన్ భేటీలో ఈమేరకు నిర్ణయం తీసుకున్నారు. ఉద్యోగాలు, ఉపాధి అవకాశాల ఆశ చూపి భారత్ నుంచి కొంతమంది యువకులను మోసపూరితంగా రష్యాకు తరలించి ఉక్రెయిన్తో యుద్ధంలోకి దింపారని గతంలో కథనాలు వెలువడిన విషయం తెలిసిందే. ఈ యుద్ధంలో వీరిలో కనీసం నలుగురు భారతీయులు యుద్ధం చేస్తూ ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. దీనిపై అప్పట్లో కేంద్ర విదేశాంగ శాఖ స్పందించి మాస్కో అధికారులతో సంప్రదింపులు జరిపింది. ఆ తర్వాత కొంతమంది భారతీయులు సురక్షితంగా స్వదేశానికి తిరిగి వచ్చారు. ఇంకా అక్కడే ఉండి ఉక్రెయిన్తో యుద్ధం చేస్తున్న భారత యువకులను రక్షించేందుకు మోడీ సర్కార్ రష్యా విదేశాంగ శాఖతో సంప్రదింపులు జరిగాయి. ఇటీవల ప్రధాని రష్యా పర్యటన సత్ఫలితాలు ఇచ్చినట్లు తెలుస్తోంది.

# ఒడిశాలో మాజీ అగ్నివీర్‌లకు శుభవార్త

● గ్రూప్ సీ, డీ ఉద్యోగాల్లో 10శాతం రిజర్వేషన్ ● గ్రూప్ సీ,డీ ఉద్యోగాల్లో నేరుగా నియామకాలు ● పోలీస్, ఎక్సైజ్, అటవీశాఖ, అగ్నిమాపక శాఖల్లో అవకాశాలు ● ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదముద్ర



భువనేశ్వర్: ఒడిశాలో మాజీ అగ్నివీర్లకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. గ్రూప్ సీ,డీ ఉద్యోగాల్లో 10శాతం రిజర్వేషన్ ప్రకటించింది. వీరిని యూనిఫామ్ సర్వీసుల్లోకి నేరుగా నియమించుకొంటామని పేర్కొంది. ఇది ప్రస్తుతం అమల్లో ఉన్న ఎక్స్ సర్వీస్మెన్ రిజర్వేషన్కు అదనంగా దీనిని అమలు చేయనున్నారు. గురవారం ముఖ్యమంత్రి మోహన్ మాఝి నేతృత్వంలో కేబినెట్ సమావేశమైంది. ఈసందర్భంగా ఎక్స్ అగ్నివీర్ రూల్స్ 2024కు ఆమోదం తెలిపింది. పోలీస్,ఎక్సైజ్, అటవీశాఖ, అగ్నిమాపక దళం లేదా ఇతర శాఖాల్లో వీరికి అవకాశాలు లభించనున్నాయి. నియామకాల సందర్భంగా మాజీ అగ్నివీర్లు కచ్చితంగా అర్హతలను పూర్తి చేయాల్సి ఉంటుంది. వీరికి ఫిజికల్ టెస్ట్ నుంచి మినహాయింపుతోపాటు.. వయస్సులో మూడేళ్ల వెసులుబాటు లభించనుంది. ఎన్నికల అనంతరం కేంద్ర ప్రభుత్వం కూడా అగ్నివీర్కు సంబంధించిన కీలక నిర్ణయాలను తీసుకొంది. వీరికి కేంద్ర పారామిలటరీ బలగాల్లో నియామకాలకు సంబంధించి సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్, బీఎస్ఎఫ్,ఆర్పీఎఫ్ల కీలక నిర్ణయం తీసుకున్నాయి. భవిష్యత్తులో చేపట్టే కానిస్టేబుల్ నియామకాల్లో 10శాతం మాజీ అగ్నివీరులకు రిజర్వ్ చేస్తున్నట్టు జులైలో ప్రకటించింది. త్రివిధ దళాల్లో అగ్నిపథ్ పథకాన్ని జూన్ 2022న కేంద్రం ప్రవేశ పెట్టింది. 17నుంచి 21సంవత్సరాల వయసున్న యువత మాత్రమే అగ్నివీర్లుగా విధులు నిర్వహించేందుకు అర్హులుగా కేంద్రం పేర్కొంది. నాలుగేళ్లు ముగిసిన అనంతరం సర్వీస్ నుంచి తప్పుకొన్న అగ్నివీర్లకు పింఛను సౌకర్యాలు ఉండవు. వారిలో 25శాతం మందిని మరో 15 ఏళ్ల పాటు రెగ్యులర్ సర్వీస్లో కొనసాగిస్తారు. దీనిపై తీవ్ర స్థాయిలో విమర్శలు రావడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు రిజర్వేషన్లు ప్రకటించడం మొదలుపెట్టాయి.





# రాహుల్‌కు కనీస అవగాహన లేదు

● ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కడ్ విసుర్లు ● దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు ● రాజ్యాంగ పదవిలో ఉండి ఇలా ప్రవర్తించడం సరికాదు ● జాతీయ ప్రయోజనాల గురించి కనీస ఆలోచన లేదు: ధన్కడ్

ఢిల్లీ: అమెరికా పర్యటనలో భాగంగా కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కడ్ పరోక్షంగా రాహుల్పై మండిపడ్డారు. ఆయన చేసిన వ్యాఖ్యలను ఖండించారు. రాజ్యాంగ పదవిలో ఉన్న ఓ వ్యక్తి ఇలా ప్రవర్తించడం సరికాదన్నారు."రాజ్యాంగం, జాతీయ ప్రయోజనాల గురించి ఆ వ్యక్తికి కనీస ఆలోచన కూడా లేదు. రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తి శత్రువులతో చేతులు కలపడంకన్నా జుగుప్సాకరమైన అంశం మరొకటి ఉండదు. దేశానికి వెలుపల ఉన్న ప్రతి భారతీయుడు ఒక రాయబారిగా ఉండాలి. కానీ, అతడు వ్యవహరించిన తీరు బాధాకరం. దేశ స్వాతంత్ర్యం, రక్షణ కోసం ఎంతో మంది ప్రాణాలను త్యాగం చేశారు. ఎందరో మహిళలు తమ భర్త, పిల్లలను కోల్పోయారు. మన జాతీయవాదాన్ని అపహాస్యం చేయలేము. దేశానికి 5 వేల ఏళ్ల నాగరికత ఉందన్న విషయం ఆ వ్యక్తికి అర్థం కావడం లేదు" అని రాహుల్ను ఉద్దేశిస్తూ పరోక్షంగా ధన్కడ్ వ్యాఖ్యానించారు.

**ఇది ఆయన అజ్ఞానం:** "మహనీయుల కృషి ఫలితంగా పవిత్రమైన రాజ్యాంగం అవతరించింది. కానీ, కొందరు మాత్రం దేశాన్ని విభజించాలనుకుంటున్నారు. ఇది వారి అజ్ఞానాన్ని తెలియజేస్తోంది" అంటూ నిప్పులు చెరిగారు. కాగా.. అమెరికా పర్యటనలో ఉన్న రాహుల్ అక్కడ ఆయా సమావేశాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రిజర్వేషన్లు సహా ఇతర అంశాలపై ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదస్పదంగా మారాయి.

దీంతో ఆయనపై విమర్శలు వెల్లువెతుతున్నాయి. దేశ వ్యతిరేక ప్రకటనలు చేయడం, దేశాన్ని విచ్ఛిన్నం చేసే శక్తులకు అండగా నిలవడం రాహుల్, కాంగ్రెస్కు అలవాటుగా మారిందని కేంద్రమంత్రి అమిత్ షా విరుచుకుపడిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత రిజర్వేషన్లపై తాను చేసిన వ్యాఖ్యలకు రాహుల్ వివరణ ఇచ్చుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే.. రిజర్వేషన్లను 50 శాతానికి మించి తీసుకెళ్తామని క్లారిటీ ఇచ్చారు. ఈ క్రమంలోనే తాజాగా స్పందించిన జగదీప్ ధన్కడ్ కాంగ్రెస్ నేతపై ఈ వ్యాఖ్యలు చేశారు.



# రాజీనామాకు సిద్ధంగా ఉన్నా

● బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ● చర్చలపై కొనసాగుతున్న ప్రతిష్టంభన ● ప్రజలకు క్షమాపణ చెప్పిన సీఎం మమత ● సచివాలయానికి వచ్చినా చర్చలకు హాజరుకాని వైద్యులు ● మరోసారి చర్చలకు ఆహ్వానం

కోల్కతా: పశ్చిమ బెంగాల్ హత్యాచార ఘటనకు వ్యతిరేకంగా నిరసనలు కొనసాగిస్తున్న జూనియర్ వైద్యులకు, రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య చర్చల విషయమై ప్రతిష్టంభన కొనసాగుతున్న వేళ సీఎం మమతా బెనర్జీ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రజల ప్రయోజనం కోసం అవసరమైతే తాను రాజీనామా చేసేందుకు కూడా సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. ఆర్జీ కర్ ఘటనలో బాధితురాలికి న్యాయం చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. వైద్యులతో సమావేశం కోసం గురువారం దాదాపు రెండు గంటలపాటు ఎదురుచూశానని, అయినప్పటికీ వారి నుంచి స్పందన లేకుండా పోయిందని తెలిపారు. నేటితో ఈ సమస్యకు తెరపడుతుందని ఆశించిన రాష్ట్ర ప్రజలకు క్షమాపణలు చెబుతున్నానన్నారు. "ప్రస్తుతం ఈ కేసు కోర్టు పరిధిలో ఉంది. అందువల్ల.. జూనియర్ వైద్యులు డిమాండ్ చేసినట్లు చర్చలను ప్రత్యక్ష ప్రసారం చేయలేం. అయితే.. ఈ భేటీ వీడియో రికార్డింగ్కు ఏర్పాట్లు చేశాం. సుప్రీంకోర్టు అనుమతితో ఆ ఫుటేజీని వైద్యులకు అందజేస్తాం. చర్చలు జరిపేందుకు ఇప్పటికే మూడుసార్లు యత్నించాను. వైద్యులు విధులకు దూరంగా ఉండటంతో ఏడు లక్షల మంది రోగులు ఇబ్బందులు పడుతున్నారు. 27 మంది మృతి చెందారు. ఆందోళన చేస్తున్న జూనియర్ డాక్టర్లపై ఎలాంటి చర్యలు తీసుకోను. పెద్దవాళ్లం కాబట్టి వారిని క్షమిస్తాను" అని మమతా బెనర్జీ చెప్పారు. హత్యాచార బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ పశ్చిమ బెంగాల్ వ్యాప్తంగా వైద్యవిద్యార్థులు చేస్తున్న నిరసనలు నెల రోజులకుపైగా కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే వారితో చర్చలు జరిపేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇందులో భాగంగా బుధవారం సాయంత్రం చర్చలకు రావాలని ఆహ్వానించగా.. 30 మంది ప్రతినిధులకు అనుమతించాలని, ఈ భేటీని ప్రత్యక్ష ప్రసారం చేయాలంటూ వారు షరతులు విధించారు. వాటిని తిరస్కరించిన ప్రభుత్వం.. గురువారం మరోసారి చర్చలకు ఆహ్వానించింది. ఈ క్రమంలోనే వైద్యులు రాష్ట్ర సచివాలయానికి చేరుకున్నప్పటికీ.. సమావేశానికి హాజరుకాలేదు.

# హర్యానా అసెంబ్లీ రద్దు

● నోటిఫికేషన్ విడుదల చేసిన గవర్నర్ బండారు దత్తాత్రేయ ● ఆర్టికల్ 174 ప్రకారం అసెంబ్లీని రద్దు చేస్తూ ఉత్తర్వులు ● కొత్త ప్రభుత్వం ఏర్పడే వరకు మంత్రిమండలికి తాత్కాలిక బాధ్యతలు ● అక్టోబర్ 5న హర్యానాలో అసెంబ్లీ ఎన్నికలు ● అక్టోబర్ 8న ఓట్ల లెక్కింపు.. ఫలితాల ప్రకటన





చండీగఢ్: హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ గురువారం ఆ రాష్ట్ర అసెంబ్లీని రద్దు చేశారు. దీనికి సంబంధించి రాజ్భవన్ నుంచి నోటిఫికేషన్ను విడుదల చేశారు. అంతకుముందు బుధవారం, ముఖ్యమంత్రి నయాబ్ సైనీ నేతృత్వంలోని మంత్రి మండలి అసెంబ్లీని సెప్టెంబరు 13 నుంచి రద్దు చేయాలని సిఫార్సు చేస్తూ గవర్నర్ ఆమోదం కోసం పంపింది. ఈ మేరకు గవర్నర్ బండారు దత్తాత్రేయ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇది వెంటనే అమల్లోకి వచ్చేలా రాజ్యాంగంలోని ఆర్టికల్ 174 ప్రకారం అసెంబ్లీని రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అసెంబ్లీని రద్దు చేసిన నేపథ్యంలో తదుపరి ప్రభుత్వం ఏర్పడే వరకు మంత్రిమండలికి తాత్కాలిక బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది. రాష్ట్రంలో చివరి అసెంబ్లీ సమావేశాలు మార్చి 13న జరిగాయి.

రాజ్యాంగం ప్రకారం, అసెంబ్లీ చివరి సమావేశం నుండి ఆరు నెలల వ్యవధి ముగిసేలోపు రాష్ట్ర శాసనసభ సమావేశాన్ని నిర్వహించాలి. హర్యానాలో, గత సమావేశాల నుండి ఆరు నెలల వ్యవధి గురువారంతో ముగిసింది. అక్టోబరు 5న హర్యానాలో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా.. మొత్తం 90 స్థానాలకు ఒకే రోజు పోలింగ్ జరగనుంది. అక్టోబర్ 8న భారత ఎన్నికల సంఘం ఓట్ల లెక్కింపు నిర్వహించి ఫలితాలను ప్రకటిస్తుంది. గెలిచే పార్టీ లేదా కూటమి తదుపరి అసెంబ్లీకి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది.

# కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్‌పై... నేడే 'సుప్రీం' తీర్పు

● ఈనెల 5న ముగిసిన వాదనలు ● తీర్పు రిజర్వు చేసిన ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం ● కేజ్రీవాల్ తరఫున అభిషేక్ మనుసింఘ్వి వాదనలు ● సీబీఐ తరఫున అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు





ఢిల్లీ: లిక్కర్ స్కాం కేసులో బెయిల్ కోరుతూ ఢిల్లీ సీఎం, ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్పై సుప్రీంకోర్టు శుక్రవారం (సెప్టెంబరు 13న) తీర్పును వెలువరించనుంది. చివరిసారిగా ఈనెల 5న న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ పిటిషన్పై వాదనలు విన్నది. సీబీఐ తరఫున అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు వాదనలు వినిపించారు.

బెయిల్ విషయంలో కేజ్రీవాల్ వాదనను తోసిపుచ్చారు. కేజ్రీవాల్ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వి వాదనలు వినిపిస్తూ.. "కేజ్రీవాల్ దేశం విడిచి వెళ్లే ఛాన్సే లేదు. ఆయన కరుడుగట్టిన నేరగాడు కాదు. బెయిల్ ఇచ్చినా కేజ్రీవాల్ ఢిల్లీలోనే ఉంటారు" అని చెప్పారు. ఇరుపక్షాల వాదనలు విన్న సుప్రీంకోర్టు బెంచ్ ఈ పిటిషన్పై తీర్పును సెప్టెంబరు 13వ తేదీకి రిజర్వ్ చేసింది. లిక్కర్ స్కాం కేసులో ఇప్పటికే ఆప్ నేత మనీశ్ సిసోడియాకు బెయిల్ వచ్చినందున..ఇక కేజ్రీవాల్కు బెయిల్ వస్తుందా ? రాదా ? అనే దానిపై ఉత్కంఠ నెలకొంది. అవినీతి కేసులో కేజ్రీవాల్ను సీబీఐ అరెస్టు చేయడాన్ని సమర్థిస్తూ ఇంతకుముందు ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. ఆయనకు బెయిల్ ఇవ్వలేమని తేల్చి చెప్పింది. ఆ ఆదేశాలను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును కేజ్రీవాల్ ఆశ్రయించారు..

# దేశ రాజకీయాలకు తీరని లోటు

ప్రధాని మోడీ సంతాపం



ఢిల్లీ: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజకీయ కురువృద్ధుడు.. సీతారాం ఏచూరి (72) మృతి చెందారన్న విషయం తెలిసిన వెంటనే ప్రధాని నరేంద్ర మోడీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గత కొంతకాలంగా.. ఊపిరితిత్తులకు సంబంధించిన సమస్యతో బాధపడుతున్న సీతారాం ఏచూరి ఆరోగ్యం గురించి ఇటీవలే మోడీ ఆరా తీసి మెరుగైన వైద్యం అందించాలని వైద్య బృందానికి సూచనలిచ్చారు. గురువారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఢిల్లీలోని ఎయిమ్స్ హాస్పిటల్ లో తన తుదిశ్వాస విడిచారన్న విషయం తెలియడంతో ప్రధాని మోడీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సీతారాం ఏచూరి మరణం.. భారత రాజకీయాలకు తీరని లోటని భారత ప్రధాని నరేంద్ర మోడీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని 'ఎక్స్'వేదికగా మాట్లాడుతూ.. "సీతారాం ఏచూరి జీ మరణించడం చాలా బాధాకరమైన విషయం. ఆయన వామపక్షాలకు ఒక మార్గదర్శిగా ఉన్నారు. సమర్థవంతమైన పార్లమెంటేరియన్ గా కూడా ఆయన మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ విషాద సమయంలో ఇప్పుడు నా యొక్క ఆలోచనలన్నీ.. ఏచూరి కుటుంబ సభ్యులపైనే ఉన్నాయి." అంటూ మోడీ ఎక్స్ లో వెల్లడించారు.

# సరిహద్దులో భారీ సైన్యం మోహరింపే.. అతిపెద్ద సమస్య: జై శంకర్



జెనీవా: చైనాతో సరిహద్దు సమస్యలు 75శాతం పరిష్కారమయ్యాయని భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ పేర్కొన్నారు. అయినప్పటికీ.. సరిహద్దులో ఇరు దేశాలు భారీ స్థాయిలో సైన్యాన్ని మోహరించడమే అతిపెద్ద సమస్య అన్నారు. స్విట్జర్లాండ్ పర్యటనలో ఉన్న ఆయన, మేధోసంస్థ సెంటర్ ఫర్ సెక్యూరిటీ కౌన్సిల్ నిర్వహించిన కార్యక్రమంలో తూర్పు లద్దాఖ్ సరిహద్దు అంశంపై మాట్లాడారు. చైనాతో బంధం సంక్లిష్టమైందన్న జైశంకర్.. సరిహద్దు సమస్యల పరిష్కారానికి చర్చలు కొనసాగుతూనే ఉన్నాయన్నారు. "ఇరు దేశాల మధ్య సంప్రదింపులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే కొంత పురోగతి సాధించాం. ఇప్పటివరకు దాదాపు 75శాతం పరిష్కారమయ్యాయని చెప్పగలను. అయినప్పటికీ ఇంకా కొన్ని సమస్యలు ఉన్నాయి. ముఖ్యంగా ఇరు దేశాలు భారీ స్థాయిలో అక్కడ సైన్యాన్ని మోహరించడం అతి పెద్ద సమస్య అని చెప్పవచ్చు" అని ఎస్ జై శంకర్ పేర్కొన్నారు. సరిహద్దులో చెలరేగిన హింస ఇరు దేశాల సంబంధాలపై తీవ్ర ప్రభావం చూపిందన్న ఆయన.. తదనంతర ద్వైపాక్షిక సంబంధాలపైనా పడిందన్నారు. సరిహద్దులో శాంతి, సామరస్యం నెలకొన్నప్పుడే ఇరు దేశాల సంబంధాల్లో సాధారణ పరిస్థితులు ఏర్పడతాయని అన్నారు. గతంలో చేసుకున్న అనేక ఒప్పందాల్లో ఉల్లంఘన జరగడం వల్లే 2020లో ఘర్షణకు కారణమైందన్నారు. అయితే, అందుకు గల కారణాలేంటనే విషయం ఇప్పటికీ అర్థం కాలేదన్నారు. వాస్తవాధీన రేఖ వెంట చైనా భారీ స్థాయిలో సైన్యాన్ని మోహరించడం వల్లే సైనికులను అక్కడకు తరలించాల్సి వచ్చిందని విదేశాంగ మంత్రి స్పష్టీకరించారు. ఇదిలాఉంటే, రెండు రోజుల స్విట్జర్లాండ్ పర్యటనలో ఉన్న జై శంకర్.. జెనీవాలోని మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళులర్పించారు.

# తైవాన్‌కు బిన్ లాడెన్ కిల్లర్స్

తైవాన్ రక్షణ కోసం 'సీల్ టీమ్-6'కు పెంటగాన్ రహస్య శిక్షణ



వాషింగ్టన్: చైనా బారి నుంచి తైవాన్ను రక్షించేందుకు అమెరికా రహస్యంగా ఏర్పాట్లు చేస్తోంది. చైనా ఆక్రమణను ఎదుర్కోవడంపై తన అత్యున్నత నేవీ సీల్స్ బృందానికి ప్రత్యేక శిక్షణ ఇస్తోంది. 2011లో పాకిస్థాన్లోకి చొచ్చుకెళ్లి అల్టై?దా నేత బిన్ లాడెన్ను ఈ బృంద సభ్యులే అంతం చేశారు. తాజాగా చైనా దురాక్రమణ చేస్తుందన్న అనుమానాలతో తైవాన్కు సాయం చేసేలా.. దీనికి శిక్షణ ఇస్తున్నట్లు ఫైనాన్షియల్ టైమ్స్ పత్రిక కథనంలో పేర్కొంది. అమెరికా దళాల్లో అత్యంత సున్నితమైన సైనిక ఆపరేషన్లను ఈ బృందమే నిర్వహిస్తుందన్న పేరుంది. దాదాపు ఏడాది నుంచి ఈ దళ సభ్యులు వర్జీనియా బీచ్లోని ప్రధాన స్థావరం డామ్నెక్ వద్ద శిక్షణ పొందుతున్నారు. దేశ రాజధాని వాషింగ్టన్కు ఇది 250 కిలోమీటర్ల దూరంలో ఉంది. చైనాతో ఘర్షణ తప్పదని అమెరికా వ్యూహకర్తలు చెబుతున్న వేళ ఈ దానిని అడ్డుకోవడానికి ఈ చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. అమెరికా దళాల్లోని ఆర్మీకి చెందిన డెల్టా ఫోర్స్తో సమానమైన దళంగా నేవీ సీల్స్ను భావిస్తారు. ఇది జాయింట్ స్పెషల్ ఆపరేషన్స్ కమాండ్కు మాత్రమే రిపోర్టు చేస్తుంది. అత్యంత రహస్యంగా నిర్వహించే కోవర్టు ఆపరేషన్లనే ఇది చేపడుతుంది. 2009లో సోమాలియ పైలట్లు మెర్స్క్ అలబామా కంటైనర్ షిప్పు హైజాక్ చేసి కెప్టెన్ బంధించారు. నాడు సీల్స్ టీమ్ అతడిని సురక్షితంగా కాపాడింది.

# గాజాలో ఇజ్రాయెల్ దాడి

ఐక్యరాజ్య సమితి సిబ్బంది మృతి



గాజా: ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం అటు గాజా ప్రజలు, ఇటు వారి సహాయార్థం సేవలందిస్తోన్న సిబ్బంది ప్రాణాలమీదకు తెస్తోంది. బెంజమిన్ నెతన్యాహు సేనలు పాఠశాల, కొన్ని ఇళ్లపై జరిపిన వైమానిక దాడిలో 34 మంది ప్రాణాలు కోల్పోయారని స్థానిక ఆసుపత్రి తెలిపింది. వారిలో తమ సిబ్బంది కూడా ప్రాణాలు కోల్పోయారని ఐక్యరాజ్య సమితి వెల్లడించింది. ఈమేరకు యూఎన్ చీఫ్ ఆంటోనియో గుటెరస్ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. "గాజాలో జరుగుతున్నది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. అంతర్జాతీయ మానవతాచట్టం ఉల్లంఘనలను వెంటనే ఆపాలి. యూఎన్ పాలస్తీనియన్ రిఫ్యూజీ ఏజెన్సీకి చెందిన ఆరుగురు సభ్యులు ప్రాణాలు కోల్పోయారు" అని ఆందోళన వ్యక్తంచేశారు. దీనిపై యూఎన్ఆర్డబ్ల్యూఏ విడిగా పోస్టు పెట్టింది. "నుసీరత్లోని పలు ప్రాంతాలు, ఒక పాఠశాలపై జరిగిన వైమానిక దాడుల్లో ఆరుగురు మా సహచర సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. ఈ స్థాయిలో నష్టం జరగడం ఇదే తొలిసారి. వారంతా శరణార్థులకు సాయంగా ఉంటూ విధులు నిర్వర్తిస్తున్నారు. వారి కుటుంబాలకు మా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాం. యుద్ధం మొదలైన దగ్గరి నుంచి ఆ పాఠశాలపై ఇప్పటికి ఐదుసార్లు దాడి జరిగింది. ఇక్కడ 12వేల మంది శరణార్థులు ఆశ్రయం పొందుతున్నారు. వారిలో మహిళలు, చిన్నారులే ఎక్కువగా ఉన్నారు. గాజాలో ఎవరూ సురక్షితంగా లేరు. ఎవరినీ వదిలిపెట్టడం లేదు. పాఠశాలలు, పౌరులకు సంబంధించిన మౌలిక సదుపాయాలపై దాడులు జరగకూడదు. పాఠశాలలు, వాటి పక్కన ఉన్న ప్రాంతాలను ఘర్షణపరమైన ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవద్దని కోరుతున్నాం" అని అభ్యర్థించింది. ఇజ్రాయెల్-హమాస్ పోరులో ఇటు గాజాలో.. అటు వెస్ట్బ్యాంక్లో రక్తపాతం కొనసాగుతోంది. పాఠశాల నుంచి హమాస్ మిలిటెంట్లు కార్యకలాపాలు కొనసాగిస్తున్నారని, అందుకే దాడి చేశామని ఇజ్రాయెల్ సైన్యం ఐడీఎఫ్ ప్రకటించింది. వెస్ట్బ్యాంక్లో ఇజ్రాయెల్ సైనిక ఆపరేషన్ కొనసాగుతోంది. ట్యూబస్ నగరంలో మిలిటెంట్లు లక్ష్యంగా నిర్వహించిన వైమానిక దాడిలో ఐదుగురిని హతమార్చినట్లు నెతన్యాహు సైన్యం తెలిపింది.



# ప్రశ్నించే గొంతుకు మూగబోయింది

**ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి:** గొప్ప కమ్యూనిస్టు పోరాట యోధుడు సీతారాం ఏచూరి అస్తమయంతో తెలుగు ప్రాంతం నుంచి ఎదిగిన ప్రశ్నించే ఒక మంచి గొంతుక మూగబోయినట్టు అయిందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు అన్నారు. సీతారాం ఏచూరి అస్తమయంతో విద్యార్థి దశ నుంచి ఎదిగిన విద్యాధికుడు, పార్లమెంటేరియన్ ను దేశం కోల్పోయిందని సంతాపం ప్రకటించారు. కాకినాడలో జన్మించిన సీతారాం, విద్యార్థిగా సీతారాం ఏచూరి ఎంతటి వారితోనైనా భయం లేకుండా మాట్లాడేవారని చెబుతారు, విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో అడుగుపెట్టిన ఏచూరి దాదాపు నాలుగు దశాబ్దాలుగా జాతీయ రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరించారని అన్నారు, 2015లో విశాఖపట్నంలో జరిగిన సీపీఐ (ఎం) మహాసభల్లో పార్టీ ఐదో ప్రధాన కార్యదర్శిగా ఆయన ఎన్నికయ్యారు. 2018లో రెండోసారి, 2022లో మూడోసారి పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. తన రాజకీయ ప్రస్థానంలో ఎన్నో పోరాటాలకు నాయకత్వం వహించారని చెప్పారు. ప్రజల గొంతుకగా ప్రభుత్వాలను నిలదీసి పార్లమెంట్లోనూ బయట కూడా ప్రజావాణిగా ఆయన మెలిగారని కొనియాడారు. ఆయనను కోల్పోవడం తెలుగు ప్రజలకే కాకుండా యావత్ దేశానికి ఒక తీరని లోటుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు శ్రీనివాసరావు వివరించారు. సమకాలీన రాజకీయాల్లో సీతారాం ఏచూరి తనదైన ముద్రవేశారని చెప్పారు.

# ఆధునికతతో వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాలి

- అభివృద్ధి సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహనకు విస్తృత ప్రచారం చేయాలి
- వెబ్ సైట్ మరింత సమర్ధవంతంగా నిర్వహించాలి
- ప్రభుత్వంపై వచ్చే నెగెటివ్ వార్తలపై ఆయా శాఖల ద్వారా వెంటనే వివరణ ఇవ్వాలి
- ప్రభుత్వ ప్రతిష్టను పెంచే విధంగా సమాచారశాఖ పని చేయాలి
- అభివృద్ధి సంక్షేమ పథకాలకు చెందిన సమాచారంపై డేటా బ్యాంకు ఏర్పాటు చేయాలి
- రాష్ట్ర సమాచార పౌరసంబంధాలు,గృహ నిర్మాణ శాఖామాత్యులు కొలుసు పార్ధసారధి



**ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి:** ఆధునిక సాంకేతిక పరిస్థితులకు అనుగుణంగా సమాచార పౌరసంబంధాల శాఖలో పనిచేసే అధికారులు,ఉద్యోగులు సాంకేతిక పరిజ్ఞానాన్నిఅలవర్చుకుని మరింత వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించు కోవాల్సిన అవసరం ఉందని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు,గృహ నిర్మాణ శాఖామాత్యులు కొలుసు పార్ధసారధి చెప్పారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో సమాచార శాఖ క్షేత్రాధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సమాచారశాఖ అంటే ప్రభుత్వానికి కళ్ళు,చెవులు,వంటిదని ప్రభుత్వం అమలు చేసే అభివృద్ధి సంక్షేమ పథకాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కలిగించుటలో ఈశాఖ ఎంతో కీలకమైనదని పేర్కొన్నారు.కావున అందుకు అనుగుణంగా అందరూ పనిచేయాల్సిన అవసరం ఉందని ముఖ్యంగా ప్రస్తుత ఆధునిక సాంకేతికతను అలవర్చుకుని అధికారులు ఉద్యోగులు వారి వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించు కోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇందుకు అవసరమైతే ఆయా రంగాలకు చెందిన నిపుణులతో ఉద్యోగులకు తగిన శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేయాలని సమాచారశాఖ డైరెక్టర్ హిమాన్షు శుక్లాకు మంత్రి పార్ధసారధి సూచించారు. అదే విధంగా ప్రస్తుతం సమాచారశాఖ అమలు చేస్తున్న ప్రత్యేక వెబ్ సైట్ ను మరింత సమర్ధవంతంగా నిర్వహించడం ద్వారా అభివృద్ధి సంక్షేమ పథకాల సమాచారాన్ని సకాలంలో ప్రజలకు చేరవేసేందుకు కృషి చేయాలని మంత్రి పార్ధసారధి చెప్పారు.ప్రభుత్వ ప్రతిష్టను పెంపొందించే రీతిలో సమాచార శాఖ అధికారులు,సిబ్బంది పని చేయాలని అన్నారు.అభివృద్ధి సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకువెళ్ళి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు వివిధ ప్రసార మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారానికి కృషి చేయాలన్నారు.ప్రభుత్వంపై ఎక్కడైనా మీడియాలో గాని లేదా సోషల్ మీడియాలో గాని వ్యతిరేక వార్తలు వస్తే వెంటనే సంబంధిత జిల్లా లేదా రాష్ట్ర స్థాయి అధికారులను సంప్రదించి రిజాయిండర్ లేదా వివరణ ఇవ్వడం ద్వారా వాస్తవాలను తెలియజేయాలని మంత్రి పార్ధసారధి సమాచారశాఖ అధికారులకు స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలు చేసే అభివృద్ధి సంక్షేమ పథకాలకు సంబంధించిన శాఖల వారీగా పూర్తి సమాచారాన్ని సేకరించి ప్రత్యేక డేటా బ్యాంకును ఏర్పాటు చేసుకునేందుకు తగిన మెకానిజాన్ని ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందని ఇందుకై ఒక ప్రత్యేక అధికారిని ఏర్పాటు చేసుకోవాలని మంత్రి పార్ధసారధి చెప్పారు.అదే విధంగా ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలకు సంబంధించిన విజయగాధలను మీడియాలో ప్రచురిత మయ్యేలా చూడాలని అన్నారు.అనంతరం జర్నలిస్టుల ఆరోగ్య పథకం,అక్రిడిటేషన్ ఇతర అజెండా అంశాలపై చర్చించారు.వివిధ ఖాళీల భర్తీ,వాహనాలు సమకూర్చడం వంటి ఇతర వ్యవస్థాపరమైన అంశాలపై సమగ్ర నివేదికను సిద్ధం చేసి సమర్పించాలని దానిపై ముఖ్యమంత్రి వర్యులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి పార్ధసారధి చెప్పారు. ఈసమావేశంలో సమాచార పౌరసంబంధాల శాఖ సంచాలకులు హిమాన్షు శుక్లా మాట్లాడుతూ అక్టోబరు 31 లోగా నూతన అక్రిడిటేషన్ విధానాన్ని రూపొందిస్తామని చెప్పారు. అదే విధంగా జర్నలిస్టుల ఆరోగ్య పథకంలో కూడా కొన్ని మార్పులు తీసుకురానున్నట్టు పేర్కొన్నారు.ప్రభుత్వ పథకాలు,కార్యక్రమాలపై ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు సమాచారశాఖ అధికారులు,సిబ్బంది మరింత సమర్ధవంతంగా పనిచేయాలని, సాంకేతికతను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు.ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలు,పథకాలపై ఎప్పటి కప్పుడు ప్రత్యేక కధనాలు, విజయగాధలు మీడియాలో ప్రచురితమయ్యే విధంగా పనిచేయాలని చెప్పారు. అనంతరం జిల్లాల వారీగా ఖాళీలు, సమకూర్చాల్సిన వాహనాలు ఇతర అంశాలపై చర్చిచారు. ఈ సమావేశంలో సమాచార సంయుక్త సంచాలకులు,ముఖ్య సమాచార ఇంజనీర్లు, డిప్యూటీ డైరెక్టర్లు,రీజనల్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్లు,ఎడిలు,డిఐ పిఆర్ఓలు తదితరులు పాల్గొన్నారు.

# అమరావతిలో స్పోర్ట్స్ హబ్



**ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి:** ఆంధ్రుల కలల రాజధాని అమరావతిలో స్పోర్ట్స్ హబ్ ను ఏర్పాటు చేయనున్నట్లు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, విజయవాడ పార్లమెంటు సభ్యుడు కేశినేని శివనాథ్ ప్రకటించారు. రాజధాని ప్రాంతంతో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో స్టేడియం నిర్మాణాలను చేపట్టి అంతర్జాతీయ మ్యాచ్ లకు వేదికగా చేయనున్నట్లు తెలిపారు. మంగళగిరిలోని ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం కార్యాలయంలో గురువారం ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అపెక్స్ బాడీ కౌన్సిల్ సమావేశాన్ని ఏసీ అధ్యక్షుడు కేశినేని శివనాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా మంగళగిరి అంతర్జాతీయ స్టేడియాన్ని ఆంధ్ర క్రికెట్ అకాడమీ సభ్యులతో కలిసి పరిశీలించిన ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాద్ మీడియాతో మాట్లాడుతూ%ౌ% ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అపెక్స్ బాడీ కౌన్సిలింగ్ మొదటి సమావేశం జరగటం ఆనందంగా ఉందన్నారు. మంగళగిరి క్రికెట్ స్టేడియం పూర్తి చేసి ఇంటర్నేషనల్ మ్యాచ్ ఆడేందుకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ సహకారంతో రోడ్లు పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. వైజాగ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియాన్ని కూడా అభివృద్ధి చేస్తామన్నారు. రాజధాని ప్రాంతంలో క్రికెట్ స్టేడియంతో పాటు త్వరలోనే స్పోర్ట్స్ హబ్ కూడా ఏర్పాటు చేస్తామని, వీటితో పాటు రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో స్టేడియం నిర్మాణాలు చేపట్టనున్నట్లు ప్రకటించారు.

# ఎవరనీ వదలని షర్మిల

- వరద ముంపుకు జగన్, బాబులే కారణం
- పది కాదు పాతికి వేలు ఇవ్వాలి



**ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి:** ఏపీ పీసీసీ చీఫ్ షర్మిలా రెడ్డి ఎవరినీ వదలడం లేదు. ఇటు రాష్ట్ర ప్రభుత్వాన్ని అటు సోదరుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పై దూకుడుగా వెళుతున్నారు. ఏపీలోని ప్రస్తుత వరదలకు ఇద్దరూ కారణం అంటూ ఆరోపణలు సంధిస్తున్నారు. గురువారం పెద్దాపురం మండలం కంద్రుకోట గ్రామంలో నీట మునిగిన పంట పొలాలను పరిశీలించిన తరువాత వైఎస్ షర్మిల మీడియాతో మాట్లాడారు. ఏలేరు ఆధునీకరణపై వైఎస్ఆర్ కున్న చిత్తశుద్ధి బాబు, జగన్ లకు లేదని మండిపడ్డారు. వరదలకు దెబ్బ తిన్న పంటకు నష్టం ఎకరాకు 10 వేలు కాదు..25వేల పరిహారం తక్షణం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వరద ముంపుకు మీరంటే మీరే కారణం అని ఇద్దరూ విమర్శలు చేసుకుంటున్నారని అసహనం వ్యక్తం చేశారు.ఏలేరు వరద ముంపు ప్రభుత్వాల వైఫల్యం వల్లే ఏలేరు రైతులను నిండా ముంచిందని, వేల ఎకరాలు నీట మునిగాయని వైఎస్ షర్మిల పేర్కొన్నారు. దీనికి కారణం రాష్ట్ర ప్రభుత్వాలే అని, గత వైసీపీ ప్రభుత్వం, ప్రస్తుత ఎన్డీయే కూటమి ప్రభుత్వం అన్నారు. ఏలేరు మరమ్మత్తుల మీద ఎవరు దృష్టి పెట్టలేదని అసహనం వ్యక్తం చేశారు. మరమ్మత్తులు లేక రైతులు దారుణంగా నష్టపోయారన్నారు. రైతుల నష్టానికి సమాధానం చెప్పాలి ఒక్కో రైతు ఇప్పటి వరకు 30 వేల వరకు పెట్టుబడి నష్టపోయారని, పెట్టిన పెట్టుబడి మొత్తం వరదపాలు అయిందని పేర్కొన్నారు వైఎస్ షర్మిల. ఈ నష్టానికి ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. వైఎస్ఆర్ హయాంలో ఏలేరు ఆధునీకరణ పనులు చేపట్టారని, 135 కోట్లు కూడా విడుదల చేసి పనులు కూడా మొదలు పెట్టారని,వైఎస్ఆర్ చనిపోయాక ఏలేరు ఆధునీకరణ పై ఎవరు దృష్టి పెట్టలేదని విమర్శలు గుప్పించారు. జగన్ మీద బాబు, బాబు మీద జగన్ ఆరోపణలు .. కానీ ఇద్దరూ దోషులే ఇప్పుడు బాబు జగన్ తప్పిదమే అంటున్నాడు.. జగన్ బాబు తప్పిదం అంటున్నారు.. బాబు హయాంలో ఆధునీకరణ పనులు ఎందుకు చేయలేదు ? అని ప్రశ్నించారు. గత 10ఏళ్లుగా ఏలేరు ఆధునీకరణపై ఇద్దరికీ పట్టింపు లేదని తేల్చి చెప్పారు.జగన్ హయాంలో ప్రాజెక్టులను గాలికి వదిలేశారని, తట్టెడు మట్టి కూడా తియ్యలేదన్నారు. డ్యాంలు కొట్టుకు పోతున్నా జగన్ కి పట్టింపు లేదన్నారు. నిర్లక్ష్యం ఫలితం రాష్ట్ర వ్యాప్తంగా 6లక్షల ఎకరాలకు నష్టం జరిగిందన్నారు. ఎకరానికి 25 వేలు ప్రకటించాలి చంద్రబాబు ఎకరాకు 10 వేల పరిహారం ఇస్తానన్నారని, అయితే 10 వేలు ఇస్తే ఏ మూలకు చాలుతుందో చెప్పాలన్నారు. కనీసం ఎకరాకు 25 వేల పరిహారం ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. జగన్ హయాంలో ఎకరాకు 4 వేల పరిహారం అని మోసం చేశాడని, జగన్ చేసిన మోసం మళ్ళీ బాబు చెయ్యొద్దన్నారు.

# ముఖ్యమంత్రి సహాయనిధికి మణిపాల్ హాస్పిటల్ రూ. 25 లక్షల విరాళం



**విజయవాడ:** వరద బాధితులకు అండగా నిలిచేందుకు విజయవాడలోని మణిపాల్ హాస్పిటల్ ముందుకు వచ్చింది. ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.25 లక్షల అందించింది. ఈ మొత్తాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికి మణిపాల్ హాస్పిటల్ యాజమాన్యం ఇచ్చింది. ఈ సందర్భంగా విజయవాడ మణిపాల్ హాస్పిటల్ డైరెక్టర్ డా. సుధాకర్ కంటిపూడి మాట్లాడుతూ 'గతంలో ఎన్నడూ లేని వరదలను విజయవాడ ప్రజలు ఎదుర్కొన్నారు. చాలా ప్రాంతాలు నీటిలో మునిగిపోయాయి. ఇలాంటి సమయంలో ప్రజలకు అండగా నిలిచేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి పిలుపు మేరకు మణిపాల్ హాస్పిటల్ ముందుకు వచ్చింది. మా వంతు సాయంగా వరద బాధితులకు రూ.25 లక్షలు అందజేశాము. గతంలో కూడా ప్రజలకు కష్ట సమయంలో మణిపాల్ హాస్పిటల్ అండగా నిలిచిందని చెప్పడానికి గర్వపడుతున్నాము' అని అన్నారు.

# ఇషాన్ కిషన్ సూపర్ సెంచరీ

- ఇండియా సీ జట్టు భారీ స్కోర్ 375/5
- ఇండియా బీ టీమ్‌తో మ్యాచ్
- ఇండియా ఏ 288/8
- అర్ధ సెంచరీలతో రాణించిన సామ్స్ ములానీ, తనుష్
- ఇండియా డీతో దులీప్ ట్రోఫీ మ్యాచ్
- అనంతపురం విద్య మేజర్ న్యూస్







***అనంతపురం విద్య మేజర్ న్యూస్:*** దులీప్ ట్రోఫీలో భాగంగా ఇండియా బీ టీమ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఇండియా%-% సీ జట్టు క్రీడాకారుడు ఇషాన్ కిషన్ సెంచరీతో కదంతొక్కాడు. దీని ఫలితంగా ఇండియా%-% సీ జట్టు భారీ స్కోర్ దిశగా పయనిస్తోంది. మరో మ్యాచ్‌లో ఇండియా ఏ, డీ జట్లు పోటీ పడ్డాయి. ఇండియా ఏ జట్టులో సామ్స్ ములానీ, తనుష్‌లు అర్ధసెంచరీలు సాధించగా ఏ జట్టు గౌరవప్రదమైన స్కోర్ చేసింది. గురువారం అనంతపురం ఆర్డీటీ స్పోర్ట్స్ సెంటర్‌లో ఉన్న రెండు మైదానాల్లో రెండో రౌండ్ మ్యాచ్ ఇండియా ఏ, డీ మధ్య, ఇండియా బీ, సీ జట్ల మధ్య నాలుగు రోజుల క్రికెట్ మ్యాచ్ మొదలైయ్యాయి.

**ఇషాన్ కిషన్ మెరుపులు ఇండియా సీ 375/5** టాస్ నెగ్గిన ఇండియా బీ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. భారత జట్టు వికెట్ కీపర్ ఇషాన్ కిషన్ ఇండియా బీతో జరిగిన మ్యాచ్‌లో మెరిశాడు. రెండో డౌన్‌లో వచ్చిన ఇషాన్ కిషన్ 126 బంతుల్లో 14 ఫోర్లు, 3 భారీ సిక్సర్ల సహాయంతో 111 సెంచరీతో అదరగొట్టాడు. ఇతనికి తోడుగా బాబా ఇంద్రజిత్ 136 బంతుల్లో 9 బౌండరీల సహాయంతో 78 పరుగులు చేశాడు. రుతురాజ్ గైక్వాడ్ 46, సాయిసుదర్శన్ 43, రజత్ పటిదార్ 40 పరుగులు చేశారు. ఆటముగిసే సమయానికి ఇండియా సీ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 79 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 375 పరుగులు చేసింది. ఇండియా బీ జట్టు బౌలర్లలో ముకేష్‌కుమార్ 3, నవదీప్ సైనీ, రాహుల్ చాహర్ చెరో వికెట్ తీసుకున్నారు.


**ఇండియా ఏ జట్టు 288/8** మరో మ్యాచ్‌లో ఇండియా ఏ, డీ జట్లు పోటీ పడ్డాయి. టాస్ నెగ్గిన ఇండియా డీ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. ఇండియా ఏ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో ఆటముగిసే సమయానికి 8 వికెట్లు కోల్పోయి 288 పరుగులు చేసింది. జట్టులో సామ్స్ ములానీ 88(8 ఫోర్లు, 3 సిక్సలు), తనుష్ కొటియన్(6 ఫోర్లు, ఒక సిక్సర్)లు అర్ధసెంచరీలో ఆకట్టుకున్నారు. ఐపీఎల్ స్టార్ ప్లేయర్ రియాన్ పరాగ్ 29 బంతుల్లో 5 ఫోర్లు, సిక్సర్ సహాయంతో 37 పరుగులు చేశారు. ఇండియా డీ బౌర్లలో హర్షిత్ రాణా, కవిరప్ప, అర్ష్‌దీప్ సింగ్ చెరో రెండు వికెట్లు తీసుకున్నారు.

### వరద ప్రభావిత ప్రాంత కస్టమర్లకు

# బజాజ్ అలియంజ్ సహాయం

**కడప:** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవలి వరదలు ప్రజల జీవితానికి, ఆస్తికి విస్తృత స్థాయిలో నష్టాన్ని కలిగించాయని, రెండు తెలుగు రాష్ట్రాల్లోని వరద ప్రభావితం వల్ల నష్టపోయిన తమ వినియోగదారులకు బజాజ్ అలియాంజ్ జనరల్ ఇన్సూరెన్స్ సత్వర సహాయాన్ని అందించనున్నట్టు సంస్థ ప్రకటించింది. ఈ మేరకు బజాజ్ అలియంజ్ జనరల్ ఇన్సూరెన్స్ ఈ క్లిష్ట సమయాల్లో తన కస్టమర్లు తిరిగి కోలుకోవడానికి సకాలంలో, సమర్థవంతమైన క్లెయిమ్ సెటిల్‌మెంట్లను అందించి వారి పట్ల తమ నిబద్ధతను తెలుపుతున్నట్టు సంస్థ ప్రతినిధి చెప్పారు. ఈ క్లిష్టమైన సమయాల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రజలకు బజాజ్ అలియంజ్ జనరల్ ఇన్సూరెన్స్ అండగా నిలుస్తుందన్నారు. ఈ విపత్తు వలన ప్రభావితమైన వారికి సాధ్యమైనంత సహకారాన్ని అందించడానికి కట్టుబడి ఉందన్నారు. బజాజ్ అలియంజ్‌తో పాటు ఇన్సూరెన్స్ పరిశ్రమ పౌరులకు, ప్రత్యేకించి సంక్షోభ సమయాల్లో, సేవలు అందించడానికి అంకితం అయిందన్నారు. కస్టమర్లకు సహాయం చేయడానికి, కంపెనీ వేగవంతమైన సమర్థవంతమైన మద్దతును అందించడానికి అనేక చర్యలను చేపట్టిందన్నారు. కస్టమర్ ప్రశ్నలకు సమాధానాలు అందించడానికి ఒక ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయబడిందన్నారు. అవాంతరాలు లేకుండా క్లెయిమ్ల ప్రక్రియను వేగవంతం చేయడానికి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయబడ్డాయన్నారు. కస్టమర్ సపోర్ట్ కోసం అత్యవసర టోల్-ఫ్రీ హెల్ప్‌లైన్ 1800 209 7072 ఏర్పాటు చేశామని, సులభమైన క్లెయిమ్ ప్రాసెసింగ్ సదుపాయాన్ని అందించేందుకు బజాజ్ అలియంజ్ తన కస్టమర్లకు షేర్ చేసిన ఎస్ఎంఎస్ అడ్వైజరీలో క్లెయిమ్ రిజిస్ట్రేషన్ లింకులు చేర్చబడ్డాయని చెప్పారు.

# బంగాళాఖాతంలో అల్పపీడనం



**ఏపీ స్టేట్ బ్యూరో సూర్య ప్రధాన ప్రతినిధి:** వర్షాలు, వరదలతో విలవిల్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఇవి వదిలిపెట్టేలా కనపడటంలేదు. బంగాళాఖాతంలో సెప్టెంబరు మూడోవారంలో మరో అల్పపీడనం ఏర్పడుతుందని విశాఖపట్నం వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఇది వాయుగుండంగా బలపడి రాష్ట్రంవైపు కదిలే పరిస్థితులు ఎక్కువగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. రుతుపవన ద్రోణి ఉత్తర కోస్తా జిల్లాలకు దగ్గరగా కొనసాగుతుండటంతో అల్పపీడనాలు ఎక్కువగా ఏర్పడటానికి అవకాశాలున్నాయని, ఈ ప్రభావంతోనే ఈనెల చివరివారంలో వర్షాలు కురుస్తాయని పేర్కొన్నారు.

**ఐదు డిగ్రీలు పెరిగిన ఉష్ణోగ్రతలు** వర్షాలు శాంతించడంతో ఉష్ణోగ్రతలు తమ ప్రతాపాన్ని చూపించడం ప్రారంభించాయి. రాష్ట్రంలో దాదాపు అన్ని ప్రాంతాల్లో సాధారణం కంటే రెండు డిగ్రీలు అదనంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. తిరుపతి, కడప, కావలి, నెల్లూరు, బాపట్ల, గన్నవరం, నరసాపురం, కాకినాడ, తుని, విశాఖపట్నంలో గరిష్ట ఉష్ణోగ్రతలు రెండు ఐదు డిగ్రీలు అదనంగా నమోదయ్యాయి. రుతుపవన విరామంవల్లే ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. రాష్ట్రం మొత్తంమీద బుధవారం ఉమ్మడి నెల్లూరు జిల్లా కావలిలో 38.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

# ఏపీలో సెబ్ రద్దు

- ఎక్సైజ్ శాఖ పరిధిలోకి 4,393 మంది ఉద్యోగులు
- 12 జీవోలనూ వెనక్కి తీసుకుంటూ డీజీపీ ఆదేశాలు జారీ



**అమరావతి :** ఏపీ కూటమి ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ఎక్సైజ్ శాఖలో సెబ్ రద్దు చేసింది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వైసీపీ హయాంలో ఏర్పాటు చేసిన స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో (సెబ్)ను రద్దు చేస్తున్నట్లు డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సెబ్‌కు కేటాయించిన 4,393 మంది ఎక్సైజ్ సిబ్బందిని తిరిగి మాతృశాఖలోకి తీసుకురావాలని నిర్ణయించింది. సెబ్ ఏర్పాటు కాక ముందు ఎక్సైజ్ శాఖ ఎలా ఉండేదో అలాంటి వ్యవస్థను పునరుద్ధరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో సెబ్ రద్దుకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే.

**డీజీపీ కీలక ఆదేశాలు** ఏపీలో వైసీపీ హయాంలో ఎక్సైజ్ శాఖలో ప్రక్షాళనకు శ్రీకారం చుట్టిన సంగతి తెలిసందే. ఇందులో భాగంగా ఎక్సైజ్ శాఖలో నుంచి కొంతమంది అధికారులతో సెబ్‌ను ఏర్పాటు చేసింది. 70 శాతం మంది ఉద్యోగులను ఎక్సైజ్ శాఖ నుంచి తప్పించి సెబ్‌లోకి తలించింది. అంటే ఎక్సైజ్ శాఖలో ఉన్న 6,274 మందిలో 1,881 (30 శాతం) మందిని మాత్రమే ఆ ఎక్సైజ్ శాఖలో ఉంచి మిగిలిన వారందరినీ సెబ్‌కు కేటాయించారు. అంటే 70శాతం మందిని సెబ్‌కు కేటాయించింది. నిన్న మొన్నటి వరకు సెబ్ విధులు నిర్వహించింది. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సెబ్ ను రద్దుచేసింది. సెబ్ రద్దుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ క్రమంలో సెబ్‌ను రద్దు చేస్తూ సెబ్‌కు కేటాయించిన ఉద్యోగులను మాతృసంస్థకు పంపించింది. మాతృసంస్థలోకి 4,3939 మంది ఉద్యోగులు ఇకపోతే సెబ్ విభాగంలో పనిచేస్తున్న అధికారులను కూడా వారి మాతృశాఖల్లో రిపోర్ట్ చేయాలని డీజీపీ ద్వారకా తిరుమల రావు అధికారిక ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే సెబ్ కోసం కేటాయించిన సామాగ్రి, కంప్యూటర్లు, వాహనాలు, భవనాలను ఎక్సైజ్ శాఖకు తిరిగి అప్పగించాలని ఉత్తర్వుల్లో వెల్లడించారు. ఇక సెబ్ రద్దు చేసిన నేపథ్యంలో 4,393 మంది ఉద్యోగులు తిరిగి ఎక్సైజ్ శాఖలో పనిచేయనున్నారు. ఇకపై ఎక్సైజ్ సిబ్బంది అంతా ఎక్సైజ్ కమిషనర్ కింద పనిచేస్తారని ఉత్త్వుల్లో పేర్కొన్నారు. ఐజీ ర్యాంకు ఐపీఎస్ అధికారి నేతృత్వంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. అంతేకాదు ప్రస్తుతం సెబ్ ఆధ్వర్యంలో ఉన్న 208 స్టేషన్లు కూడా ఎక్సైజ్ స్టేషన్ల పరిధఇలోకి రాబోతున్నాయి.

**కూటమి హయాంలో సెబ్ రద్దు** ఇకపోతే ఏపీలో మద్యం పాలసీ విధానాన్ని తీసుకువస్తున్నట్లు నాటి వైసీపీ ప్రభుత్వం ప్రకటించిన సంగతితెలిసిందే. ఈ క్రమంలో లిక్కర్ అక్రమ రవాణాను అడ్డుకునేందుకు నాటి ప్రభుత్వం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్)ను ఏర్పాటు చేసింది. ఈ సెబ్ ఏర్పాటులో భాగంగా ఎక్సైజ్ శాఖ నుంచి 70 శాతం మంది ఉద్యోగులను, సిబ్బందిని కేటాయించిన సంగతి తెలిసిందే. ఎక్సైజ్ శాఖకు అనుబంధంగా సెబ్ ఇన్ని రోజులూ పనిచేస్తూ వచ్చింది. అయితే ఏపీలో అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం సెబ్ రద్దు చేయాలని నిర్ణయించింది.

# నేడు పిఠాపురంలో వైఎస్ జగన్ పర్యటన



**తాడేపల్లి:** వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రేపు(శుక్రవారం) పిఠాపురంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా వరద ప్రభావిత ప్రాంతాల్లో వైఎస్ జగన్ పర్యటించనున్నారు. అక్కడ ప్రజలు, రైతులను వైఎస్ జగన్ కలువనున్నారు. కాగా, వైఎస్ జగన్ రేపు పిఠాపురంలో పర్యటించి వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించనున్నారు. ఈ క్రమంలో మాధవరం, నాగులపల్లి, రమణక్కపేలో వరద బాధితులను పరామర్శించనున్నారు. అయితే, ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పిఠాపురంలో పంటలు నీటమునిగాయి. పలు ప్రాంతాల్లో ఇళ్లలోకి వరద నీరు చేరుకున్న విషయం తెలిసిందే. ఆ ప్రాంతాలను వైఎస్ జగన్ పరిశీలించనున్నారు.

**పర్యటన షెడ్యూల్ ఇలా..**

వైఎస్ జగన్.. శుక్రవారం ఉదయం 9.15 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి 10.30 గంటలకు పిఠాపురం చేరుకుంటారు. అక్కడినుంచి బయలుదేరి పాత ఇసుకపల్లి మీదుగా మాధవపురం చేరుకుంటారు. అక్కడ వరద బాధితులతో మాట్లాడిన అనంతరం యూ.కొత్తపల్లి మండలం నాగులపల్లి చేరుకుంటారు. అనంతరం.. రమణక్కపేట వెళతారు. అక్కడ బాధితులని పరామర్శిస్తారు.

# అస్తమించిన అరుణ కిరణం



**• కడవరకు జనం కోసం • పార్థివ దేహాన్ని సైతం నలుగురికి అంకితం**
**• నింగికెగిసిన కమ్యూనిస్టు యోధుడు సీతారాం ఏచూరి**

సీతారాం ఏచూరి.. తెలుగు వారికే కాదు.. జాతీయ రాజకీయాల్లోనూ పెద్దగా పరిచయం అక్కర్లేని పేరు ఇది. ఎర్ర జండాను పట్టుకుని ఎన్నో ప్రజా ఉద్యమాలను ముందుండి నడిపించిన నాయకుడు ఇప్పుడు మనతో లేరు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ కొద్దిసేపటి క్రితమే ఢిల్లీలోని తుదిశ్వాస విడిచారు. కమ్యూనిస్టు రాజకీయాల్లో ఏచూరి పోషించిన చురుకైన పాత్ర ఆయన్ని అనతికాలంలోనే రాష్ట్రస్థాయి నుండి జాతీయ స్థాయికి ఎదిగేలా చేసింది. ఇప్పుడు మనం చూస్తున్న తరంలో కామ్రేడ్ సీతారాం ఏచూరి అంటే ఒక్క తెలుగునాట ఉన్న కమ్యూనిస్టులకే కాదు.. దేశంలో ఆ పార్టీని ఆదరించే వారికి, ఆ పార్టీకి పనిచేసేవారికి ఎందరికో ఆయన ఓ పెద్ద



దిక్కు. ఎంతోమంది కమ్యునిస్టులున్న మన దేశంలో ఆయన తిరుగులేకుండా వరుసగా మూడు పర్యాయాలు సీపీఐ(ఎం) పార్టీకి జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికవడమే అందుకు ఒక ఉదాహరణగా చెప్పుకోవచ్చు. తిరుగుబాటు జండా ఎత్తి జాతీయ రాజకీయాల్లోకి వెళ్లినప్పటికీ.. సీతారాం ఏచూరి ఏనాడూ గొంతుచించుకుని మైలేజ్ పెంచుకోలేదు. ఎందుకంటే ఆయనది ఒకింత మృధు స్వభావమే. అయినప్పటికీ ఆ పార్టీలో ఆయన్ని దాటుకుని వెళ్లిన కామ్రేడ్ లేడు. జాతీయ రాజకీయాలను నాలుగైదు దశాబ్దాల నుండి దగ్గరిగా చూస్తూ వాటితోనే కలిసి ప్రయాణం చేస్తోన్న సైలెంట్ పొలిటిషియన్. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి కన్నూమూశారు. శ్వాసకోశ సంబంధిత, ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన ఆగస్ట్ 19 నుంచి ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చికిత్సం పొందుతున్నారు. వెంటిలేటర్‌పై ఆయనకు వైద్యులు చికిత్స అందించారు. చివరికి ఆయన పరిస్థితి విషమించడంతో సెప్టెంబర్ 12 గురువారం తుది శ్వాస విడిచారు. తీవ్ర జ్వరంతో బాధపడుతున్న సీతారాం ఏచూరి ఆగస్టు 19న ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చేరారు. ఆయన 25 రోజులుగా చికిత్స పొందుతున్నారు. 72 ఏళ్ల ఏచూరి సీపీఎం నేతకు ఇటీవల క్యాటరాక్ట్ ఆపరేషన్ కూడా జరిగింది. డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి, డాక్టర్ గౌరి నేతృత్వంలో వైద్య బృందం ఆయనకు చికిత్స అందించింది. అయితే ఇన్‌ఫెక్షన్ తొలగించేందుకు ఉపయోగించిన మందులు పనిచేయకపోవడంతో జపాన్ నుంచి ప్రత్యేక మందులు కూడా తెప్పించారు. ఢిల్లీలోని ఎయిమ్స్ చికిత్స పొందుతున్న ఆయన ఇవాళ తుది శ్వాస విడిచారు. దీంతో కమ్యూనిస్ట్ వర్గాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

## ఏచూరి బాల్యం..

ఆయన పూర్తిపేరు ఏచూరి సీతారామరావు. 1952 ఆగస్టు 12 చెన్నైలో వైదేహి బ్రాహ్మణులైన సర్వేశ్వర సోమయాజులు ఏచూరి,కల్పకం దంపతులకు జన్మించారు. తండ్రి సర్వేశ్వర సోమయాజులు ఏమూరి ఆంధ్రప్రదేశ్ స్టేట్ రోడ్ కార్పొరేషన్లో ఇంజినీర్‌గా పని చేశారు. తల్లి కల్పకం ఏచూరి ప్రభుత్వ అధికారిణిగా ఉండేవారు. ఏచూరి బాల్యం ఎక్కువగా హైదరాబాద్‌లోనే సాగింది. భాగ్యనగరంలోని అల్ సెయింట్స్ హైస్కూల్లో ఆయన మెట్రిక్యులేషన్ పూర్తి చేశారు. అనంతరం ఢిల్లీకి వెళ్లి ప్రెసిడెంట్స్ ఎస్టేట్ స్కూల్లో చేరారు. 1970లో సీబీఎస్సీ సెకండరీ పరీక్షలో ఆల్ ఇండియా ర్యాంకర్‌గా నిలిచారు. సెయింట్ స్టీఫెన్స్ కాలేజీలో ఎకనామిక్స్‌లో బీఏ పూర్తి చేశారు. జేఎన్‌యూ నుంచి ఎంఏ పట్టా పొందారు. అనంతరం అక్కడే పీహెచ్‌డీలో చేరారు. అయితే అప్పటికే దేశవ్యాప్తంగా ఎమర్జెన్సీ విధించడం.. ఏచూరిని అరెస్ట్ చేయడంతో పీహెచ్‌డీ కొనసాగించలేకపోయారు.

## దాంపత్య జీవితం..

సీతారం ఏచూరి రెండు వివాహాలు చేసుకున్నారు. ఆయన మొదటి భార్య ఇంద్రాణి మజుందార్ కాగా.. జర్నలిస్టు సీమా చిత్తీ రెండో భార్య. ఏచూరి రెండో భార్య సీమా చిస్తీ జర్నలిస్టు. తన భార్య తనకు ఆర్థికంగా సహకరిస్తుందని ఏచూరి ఒక ఇంటర్వ్యూలో చెప్పారు.

సీతారాం ఏచూరీ - ఇంద్రాణి మజుందార్ లకు అశీష్ ఏచూరి, అఖిల ఏచూరి అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. అశీష్ ఏచూరి 2021లో కరోనా కారణంగా మృతిచెందారు. అఖిల యూనివర్శిటీ ఆఫ్ ఎడిన్‌బర్గ్, యూనివర్శిటీ ఆఫ్ సెయింట్ అండ్రూస్‌లో ఆచార్యురాలుగా పనిచేస్తున్నారు. సీతారాం ఏచూరీ సీమాచిస్తీ అనే జర్నలిస్టును రెండోవివాహం చేసుకున్నారు. అప్పట్లో ఆమె బీబీసీ హిందీ ఢిల్లీ ప్రతినిధిగా పని చేశారు. ప్రస్తుతం సీమా చిస్తీ ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో రెసిడెంట్ ఎడిటర్ గా ఉన్నారు. అంతేకాక, సీతారాం ఏచూరి హిందూస్థాన్ టైమ్స్‌లో తరచూ కాలమ్స్ రాస్తుంటారు.

## రాజకీయ రంగ ప్రవేశం ఇలా..

తప్పు జరిగితే సహించలేని మనస్థత్వం ఏచూరిది. అందుకే చిన్నప్పటి నుంచే రాజకీయాల్లోకి రావాలనే కుతూహలం ఉండేది. విద్యార్థిగా ఉన్నప్పుడే ఎస్ఎఫ్ఐ నేతగా 1974లో సీతారాం ఏచూరి రాజకీయ ప్రస్థానం ప్రారంభమైంది. 1975లో జేఎన్‌యూ విద్యార్థిగా ఉన్నప్పుడు కమ్యూనిస్టు భావజాలానికి ఆకర్షితులై సీపీఎంలో చేరారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీ బాధితుల్లో ఏచూరీ కూడా ఒకరు. ఎమర్జెన్సీ సమయంలో ఆయన్ని పోలీసులు అరెస్ట్ చేశారు. జేఎన్‌యూ విద్యార్థి సమాఖ్యకు ఏచూరి మూడుసార్లు అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

## ఎర్రజండా పట్టుకోవాల్సిన అవసరం ఏమొచ్చిందంటే

సీతారాం ఏచూరి మంచి విద్యావేత్త. హైదరాబాద్ నిజాం కాలేజ్‌లో ఉన్నత చదువులు చదువుకుంటున్న రోజుల్లోనే.. కులాల కుమ్ములాటలు, గొప్పగొప్ప చదువులు చదువుకున్న వారిని కూడా నిరుద్యోగం సమస్య వేధించడం వంటి పరిణామాలు సీతారాం ఏచూరిని సమాజం గురించి ఆలోచింపజేశాయి. తమ తాతలు, తల్లిదండ్రులు, మేనమామ.. ఇలా ఇంట్లో అందరూ విద్యావేత్తలే కావడంతో అవే ఆధునిక భావాలతో పెరిగారు. మేనమామ మోహన్ కందా ఐఏఎస్ ఆఫీసర్ కావడంతో సీతారాం ఏచూరిని కూడా కలెక్టర్‌గా చూడాలనేది వారి ఇంట్లో పెద్దల ఆశ.. కల. కానీ ఆధునిక భావజాలం, తిరుగుబాటు మనస్తత్వం, కార్మికులు, కర్షకుల కష్టాలు, నిరుద్యోగ సమస్యలు, కులాల కుమ్ములాటలు, మతోన్మాద ఘర్షణలు.. ఇలా సమాజాన్ని పట్టిపీడిస్తున్న అన్ని జాడ్యాలను చూస్తూ వచ్చిన సీతారాం ఏచూరి చివరకు ఉద్యమాల మార్గాన్నే ఎంచుకున్నారు. ప్రజాపక్షాన నిలిచేందుకు ఎర్ర జండా చేతపట్టి లాల్ సలాం కామ్రేడ్స్ అంటూ కమ్యూనిస్టులకి దగ్గరయ్యారు.. ఆ తరువాత అంచలంచెలుగా ఎదిగి వారికే పెద్దదిక్కయ్యారు. సీతారాం ఏచూరిని రాటుదేల్చిన 'ఎమర్జెన్సీ' సీతారాం ఏచూరి కమ్యూనిస్ట్ పార్టీలో చేరి రాజకీయాల్లో చురుకుగా వ్యవహరిస్తున్న తొలినాళ్లలోనే కేంద్రంలో అప్పుడు అధికారంలో ఉన్న ఇందిరా గాంధి సర్కారు దేశంలో ఎమర్జెన్సీని విధించారు. అప్పట్లో దేశం నలుమూలలా ఎంతో ప్రాభవం ఉన్న కమ్యూనిస్ట్ పార్టీ ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాటాలు చేసింది. ఈ క్రమంలోనే చాలామంది కమ్యూనిస్ట్ నాయకులతో పాటే సీతారాం ఏచూరి కూడా జైలుపాలయ్యారు. ఇద్దరు తాతల్లో ఒకరు జడ్జి కాగా, మరొకరు తహశీల్దార్ కావడం.. తండ్రి ఇంజనీర్ కావడంతో ఈ అరెస్టులు, జైళ్లు మనకెందుకొచ్చిన తలనొప్పి వెనకొచ్చేయమని అన్నారట. కానీ కామ్రేడ్ సీతారాం ఏచూరి మాత్రం అప్పటికే ఎమర్జెన్సీకి వ్యతిరేక పోరాటాలతో మరింత రాటుదేలిపోయారు. కమ్యూనిస్టులతో కలిసి అనుభవించిన జైలు జీవితంలోనే మరిన్ని పాఠాలు ఒంటబట్టించుకున్నారు. ఇంట్లో వాళ్లు వద్దని వారించినప్పటికీ.. సీతారాం ఏచూరి మాత్రం ఈసారి మరింత రెట్టించిన ఉత్సాహంతో ఎర్రజండాకే ఎలుగెత్తి జైకొట్టారు. సీపీఎం మాజీ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కరాత్తో కలిసి జేఎన్‌యూను వామపక్షాలకు కంచుకోటగా మార్చారు. అనంతరం ఎస్ఎఫ్ఎస్ఐ ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షుడిగా పనిచేశారు. 1984లో సీపీఎం కేంద్ర కమిటీలో చేరారు. 1990లో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా, 2005లో వెస్ట్ బెంగాల్ నుంచి తొలిసారి రాజ్యసభకు ఎన్నికయ్యారు. 2015లో విశాఖపట్నంలో జరిగిన 21వ సీపీఎం మహాసభల్లో పార్టీ ఐదో ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కేరళ విప్లవ సూర్యుడు వీఎస్ అచ్యుతానందన్‌కి ఏచూరి అత్యంత సన్నిహితుడు



## అంత్యక్రియలుండవ్

అందరిలా సీతారాం ఏచూరి పార్థివ దేహాన్ని అంత్యక్రియలు చేయడం లేదని సీపీఎం ప్రకటించింది. ఆయన కోరిక మేరకు ఆయన దేహాన్ని ఢిల్లీ ఎయిమ్స్‌కు అప్పగించనున్నట్లుగా ప్రకటించింది. అంతేకాక, ఎయిమ్స్ కూడా ఈ విషయాన్ని ధ్రువీకరిస్తూ ఓ ప్రకటన విడుదల చేసింది. "సీతారాం ఏచూరి (72) నిమోనియాతో ఆగస్టు 19న ఎయిమ్స్‌లో అడ్మిట్ అయ్యారు. సెప్టెంబరు 12 సాయంత్రం 3.05 గంటలకు చనిపోయారు. డెడ్ బాడీని ఆయన ఫ్యామిలీ ఢిల్లీలోని ఎయిమ్స్‌కు అప్పగించింది. టీచింగ్ అండ్ రీసెర్చ్ కోసం ఈ డెడ్ బాడీ ఉపయోగపడుతుంది" అని ఎయిమ్స్ ఆస్పత్రి ప్రకటించింది.



## అంచెలంచెలుగా ఎదిగిన ఏచూరి

సీతారాం రాజకీయ ప్రస్థానం 1974లో ప్రారంభం అయింది. అప్పట్లో ఎస్ఎఫ్ఐ మెంబర్ గా చేరారు. ఆ తర్వాతి ఏడాదే సీపీఎం సభ్యుడిగా చేరారు. దేశంలో ఎమర్జెన్సీ కాలానికి ముందు ఆయన అండర్ గ్రౌండ్‌కు వెళ్లారు. ఎమర్జెన్సీ ఎత్తివేసిన తర్వాత జేఎన్‌యూ స్టూడెంట్ లీడర్‌గా ఏచూరి మూడుసార్లు ఎలక్ట్ అయ్యారు. 1978లో అఖిల భారత ఎస్ఎఫ్ఐ జాయింట్ సెక్రటరీగా, తర్వాత ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు. అలా అంచెలంచెలుగా ఎదుగుతూ సీపీఎం ప్రధాన కార్యదర్శి అయ్యారు. 1985లో కమ్యూనిస్టు పార్టీ సెంట్రల్ కమిటీలో, 1988లో కేంద్ర కార్యవర్గంలో, 1999లో పొలిట్ బ్యూరోలో సీతారాం ఏచూరికి చోటు లభించింది. 2005లో బెంగాల్ నుంచి రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. అలా 1992 నుంచి పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా ఉండగా.. 2005 నుంచి 2017 వరకు రాజ్యసభ సభ్యుడిగా బెంగల్ నుంచి కొనసాగారు. ఆయన తన జీవిత కాలం మొత్తం వామపక్ష భావజాలంతోనే జీవించారు.

## నా మనవణ్ణి నాకిచ్చేయమని సుందరయ్యతో గొడవపెట్టుకున్న అమ్మమ్మ..

సీతారాం ఏచూరి యువకుడిగా కమ్యూనిస్ట్ పార్టీలో చేరిన రోజులవి. అప్పటికే ఇండియాలో సీపీఐ(ఎం) స్థాపకుల్లో ఒకరైన తొలితరం కమ్యూనిస్ట్ పోరాట యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య తమ కమ్యూనిస్టు పోరాటాలను ముందుకు తీసుకెళ్లే యువతరం కోసం అన్వేషిస్తున్నారు. అదే సమయంలో సీతారాం ఏచూరి ఆయన కంటపడ్డారు. సీతారాం ఏచూరిలో చురుకుతనం చూసి పార్టీలో ఆయన్ని ప్రోత్సహించారు. కానీ సీతారాం పోరాటల బాట పట్టి కెరీర్ నాశనం చేసుకుంటున్నాడు అనే ఆవేదనలో ఉన్న వాళ్ల అమ్మమ్మ ఇదే విషయమై ఒకసారి పుచ్చలపల్లి సుందరయ్యను నిలదీశారట. నా మనవణ్ణి వదిలేసి ఆ స్థానంలో ఇంకెవరినైనా చూసుకొమ్మని చెప్పారట. అందుకు పుచ్చలపల్లి సుందరయ్య కూడా అంతే తెలివిగా స్పందిస్తూ.. "నీ మవనడి లాంటివాడిని నాకు ఇంకొకరెవరైనా ఉంటే ఇవ్వండి.. అలాగే వదిలేస్తాను" అని అన్నారట. సుందరయ్య అన్న ఆ ఒక్క మాటతో సీతారాం ఏచూరి వాళ్ల అమ్మమ్మ ఇక సైలెంట్ అయిపోయారట. అంతేకాదు.. "నా మనవడు లాంటి వాడు ఇంకొకరు దొరకరు అనేది సుందరయ్య అభిప్రాయం" అని అర్థమయ్యాకా ఇక ఎన్నడూ సీతారాంని ఆమె అడ్డుకునే ప్రయత్నం చేయలేదు.

## ప్రస్తుత రాజకీయాల్లో..

దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించాక రాజకీయాల ముఖస్వరూపం మారిపోయింది. అయితే ప్రస్తుత రాజకీయాలకు కావాల్సిన నాయకత్వ లక్షణాలను అలవర్చుకుంటూ ఏచూరి ఎదుగుతూ వచ్చారు. కొన్నిసార్లు కేంద్ర ప్రభుత్వం నిర్ణయాల్లో కీలకంగా ఉన్నారు. 1996లో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం కోసం కామన్ మినిమమ్ ప్రోగ్రామ్ ముసాయిదాను రూపొందించడంలో మాజీ కేంద్ర మంత్రి చిదంబరంతోపాటు ఏచూరి కీలక భూమిక పోషించారు. 2004లో అప్పటి యూపీఏ సర్కార్ నిర్మాణంలోనూ ఏచూరిది ప్రముఖ పాత్ర అని చెప్పుకోవచ్చు. కాకినాడతో ఏచూరికి ఉన్న అనుబంధం.. సీతారాం ఏచూరి తల్లిదండ్రుల రెండు కుటుంబాలు కాకినాడకి చెందినవారే. దీంతో చిన్నప్పటి నుండి సెలవులకు హైదరాబాద్ నుండి అక్కడికి వెళ్లిరావడం జరిగేది. ఇప్పటికీ సంవత్సరానికి ఒకసారి అలా కొన్నిరోజులైనా కాకినాడలో గడిపివెళ్లడం అలవాటే అంటారు ఏచూరి. ముఖ్యంగా ఢిల్లీలో చలి బాగా అధికంగా ఉన్న సందర్భంలో అమ్మని తీసుకుని హైదరాబాద్‌కు, కాకినాడకు వచ్చేవాళ్లం అని ఏచూరి తనకు కాకినాడతో ఉన్న అనుబంధాన్ని నెమరేసుకున్నారు.



విద్య వెంకట్, తెలంగాణ బ్యూరో 9391618181



## మోడీకి స్పెషల్ గిఫ్ట్ ఇచ్చిన అవనీ లేఖరా

ఢిల్లీ: పారిస్ పారాలింపిక్స్ 2024లో పాల్గొన్న క్రీడాకారులు ప్రధాని నరేంద్ర మోడీని కలిశారు. పారాలింపియన్లందరినీ ప్రధానమంత్రి తన నివాసానికి పిలిచారు. ఇక్కడ ప్రధానమంత్రి ఆటగాళ్లందరితో ఒక్కొక్కరితో మాట్లాడి వారి అనుభవాలను తెలుసుకున్నారు. గంటకు పైగా జరిగిన సమావేశంలో ప్యారా అథ్లెట్ల విజయగాథలను వింటూ ప్రధాని మోదీ అందరితో సంభాషించారు. చారిత్రాత్మక పారాలింపిక్స్ ప్రచారంలో భారత్ 29 పతకాలను గెలుచుకుంది. 2021లో టోక్యో (19) తర్వాత అత్యుత్తమ పతకాలను మెరుగుపరుచుకుంది.పారిస్లో జరిగిన మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ స్టాండింగ్ ఎస్హెచ్ 1 ఈవెంట్లో బంగారు పతకాన్ని దక్కించుకున్న షూటర్ అవనీ లేఖరా, ప్రధాని మోదీకి సంతకం చేసిన టీ షర్ట్ను బహుమతిగా ఇచ్చింది. ప్రధానికి బహూకరించిన టీషర్ట్ వెనుక మీ మద్దతుకు, ధన్యవాదాలు సార్ అని రాసి ఉంది. పారాలింపియన్లను అభినందించి, విజేతలతో ఫొటోలు దిగుతూ ప్రధాని మోదీ కూడా మెడల్స్పై సంతకం చేయడం కనిపించింది.4 రోజుల క్రితం సెప్టెంబర్ 8న పారిస్ వేదికగా ముగిసిన క్రీడల్లో భారత్ 7 స్వర్ణాలు, 9 రజతాలు, 13 కాంస్యాలతో సహా 29 పతకాలు సాధించింది. మొదటిసారిగా, భారతదేశం పారా-గేమ్స్ పతకాల పట్టికలో టాప్-20లో చేర్చింది. ఇందులో భారతదేశం 18వ స్థానానికి చేరుకుంది.

# ఒలింపిక్స్ విజేతలతో
# మోడీ ఆత్మీయ భేటీ

● పారిస్ పారాలింపిక్స్‌లో 29 పతకాలు సాధించిన భారత్ ● స్వదేశానికి చేరుకున్న విజేతలతో ప్రధాని మోడీ సమావేశం



ఢిల్లీ: పారిస్ వేదికగా జరిగిన పారాలింపిక్స్ భారత అథ్లెట్లు సత్తా చాటారు. మొత్తం 29 పతకాలను సాధించారు. స్వదేశానికి చేరుకున్న విజేతలతో ప్రధాని మోదీ దిల్లీలోని తన అధికారిక నివాసంలో సమావేశమయ్యారు. అథ్లెట్లను అభినందించారు. దేశం కోసం వారు చేసిన కృషిని కొనియాడారు. ఈ సందర్భంగా వారితో కాసేపు ముచ్చటించారు.

అంతర్జాతీయ వేదికపై సత్తా చాటిన భారత అథ్లెట్లు 29 పతకాలను సాధించడం అభినందనీయం. వారి అంకితభావంతోనే ఇది సాధ్యమైంది. ఎంతోమందికి ఇది స్ఫూర్తిదాయకం అని ఎక్స్లో ప్రధాని మోదీ ప్రశంసించారు. తాజాగా అథ్లెట్లతో మోదీ ముచ్చటిస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్గా మారింది. ఈ భేటీలో కేంద్ర క్రీడా మంత్రి మన్సుఖ్ మాండవీయ, పారాలింపిక్స్ కమిటీ ఆఫ్ ఇండియా (పీసీఐ) హెడ్ దేవేంద్ర జజారియా కూడా పాల్గొన్నారు.

పారాలింపిక్స్లో ఆర్చరీ విభాగంలో స్వర్ణం సాధించిన హర్విందర్ సింగ్.. ప్రధానితో జరిగిన సమావేశంలోని విశేషాలను మీడియాతో పంచుకున్నాడు. ప్రధాని మమ్మల్ని ఎంతో ప్రోత్సహించారు. మా బృందాన్ని ప్రశంసించారు. క్రీడా సిబ్బందితో ఆయన ముచ్చటించారు. ఈ సందర్భంగా నా బాణాన్ని ప్రధానికి బహుమతిగా ఇవ్వడం సంతోషంగా ఉంది అని పంచుకున్నాడు. కాగా.. ఇటీవల పారిస్లో జరిగిన పారాలింపిక్స్లో భారత్ అథ్లెట్లు అసాధారణ ప్రతిభ కనబరిచారు. ఏకంగా 29 పతకాలు సాధించి ఔరా అనిపించారు.

ఇందులో అత్యధిక మెడల్స్ అథ్లెటిక్స్లోనే రావడం విశేషం. ఈ విభాగంలో నాలుగు స్వర్ణాలు సహా 17 పతకాలు వచ్చాయి. ఓవరాల్గా ఏడు స్వర్ణాలు, 9 రజతాలు, 13 కాంస్యాలతో 18వ స్థానంలో నిలిచింది. పారాలింపిక్స్ చరిత్రలో భారత్ అత్యధిక పతకాలు సాధించడం ఇదే తొలిసారి. 2020లో నిర్వహించిన టోక్యో పారాలింపిక్స్లో 5 స్వర్ణాలు సహా 19 పతకాలను భారత్ సాధించిన సంగతి తెలిసిందే. ఈ సారి అంతకు మించి పతకాల పంట పండించింది.

## భారత్‌తో టెస్టు సిరీస్‌కు బంగ్లా స్క్వాడ్

● పాక్‌ను ఓడించిన జట్టునే ప్రకటించిన బంగ్లాదేశ్ బీసీబీ
● భారత్ పర్యటనలో రెండు టెస్టులు, మూడు టీ20లు ఆడనున్న బంగ్లా



ఢాకా: సెప్టెంబర్ 19 నుంచి భారత్ - బంగ్లాదేశ్ జట్ల మధ్య రెండో టెస్టు సిరీస్ ప్రారంభం కానుంది. ఇప్పటికే టీమ్ఇండియా తొలి టెస్టు స్క్వాడ్ను ప్రకటించింది. తాజాగా బంగ్లాదేశ్ టెస్టు జట్టును వెల్లడించింది. పాకిస్థాన్ను వారి సొంత గడ్డపైనే ఓడించిన టీమ్ సభ్యులనే బంగ్లా క్రికెట్ బోర్డు ఎంపికచేయడం గమనార్హం. నజ్ముల్ షాంటో కెప్టెన్గా వ్యవహరిస్తాడు. బంగ్లాదేశ్ అల్లర్ల సమయంలో ఎంపీ పదవిని కోల్పోయిన షకిబ్ అల్ హసన్కు అవకాశం దక్కింది. పాక్పై అద్భుత శతకం సాధించిన సీనియర్ ఆటగాడు ముష్ఫికర్ రహీమ్ను తీసుకుంది. 16 మందితో కూడిన జట్టును బీసీబీ ప్రకటించింది. లెఫ్టార్మ్ పేసర్ షోరిఫుల్ ఇస్లామ్ గాయం కారణంగా సిరీస్కు దూరమయ్యాడు. పాక్తో తొలి టెస్టు సందర్భంగా గాయపడిన సంగతి తెలిసిందే. ఇంకా కోలుకోకపోవడంతో విశ్రాంతినిస్తూ బీసీబీ నిర్ణయం తీసుకుంది.బంగ్లాదేశ్ జట్టు ఇదే: నజ్ముల్ షాంటో (కెప్టెన్), షద్మాన్ ఇస్లామ్, జకీర్ హసన్, మోమినల్ హక్, ముష్ఫికర్ రహీమ్, షకిబ్ అల్ హసన్, లిటన్ దాస్, మెహిదీ మిరాజ్, జకేర్ అలీ, తస్కిన్ అహ్మద్, హసన్ మహ్మద్, నహిద్ రానా, తైజుల్ ఇస్లామ్, మహ్మదుల్ హసన్ జాయ్, నయీమ్ హసన్, ఖలీద్ అహ్మద్

టెస్టు సిరీస్ ఇలా..

తొలి టెస్టు: సెప్టెంబర్ 19 నుంచి సెప్టెంబర్ 23 వరకు (చెన్నై)

రెండో టెస్టు: సెప్టెంబర్ 27 నుంచి అక్టోబర్ 1 వరకు (కాన్పూర్)

తొలి టెస్టుకు మాత్రమే...

దులీప్ ట్రోఫీ తొలి రౌండ్ మ్యాచ్ల అనంతరం భారత జట్టును బీసీసీఐ ఎంపిక చేసింది. బంగ్లాదేశ్తో మొదటి టెస్టుకు మాత్రమే టీమ్ఇండియా స్క్వాడ్ను ప్రకటింటించిన సంగతి తెలిసిందే. చాన్నాళ్ల తర్వాత రిషభ్ పంత్ మళ్లీ సుదీర్ఘ ఫార్మాట్లోకి అడుగు పెట్టాడు. భారత జట్టు: రోహిత్ శర్మ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, శుభ్మన్ గిల్, విరాట్ కోహ్లి, కేఎల్ రాహుల్, సర్ఫరాజ్ ఖాన్, రిషభ్ పంత్ (వికెట్ కీపర్), ధ్రువ్ జురెల్ (వికెట్కీపర్), రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, మహ్మద్ సిరాజ్, ఆకాశ్ దీప్, జస్ప్రీత్ బుమ్రా, యశ్ దయాళ్.

### ఆసియా ట్రోఫీ హాకీ..
## సెమీ ఫైనల్‌కు భారత్

● 3-1తో దక్షిణ కొరియాను ఓడించిన భారత్
● వరుసగా నాలుగో విజయంతో సెమీస్‌లో అడుగుపెట్టిన భారత్



బీజింగ్: ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ హాకీలో భారత్ జైత్రయాత్ర కొనసాగుతోంది. ఇప్పటికే వరుసగా మూడు విజయాలు సాధించి భారత్.. గురువారం 3-1తో దక్షిణ కొరియాను ఓడించి సెమీఫైనల్లో అడుగుపెట్టింది. భారత్ తరఫున అరైజీత్ సింగ్ (8వ నిమిషం), కెప్టెన్ హర్మన్ప్రీత్ సింగ్ (9వ నిమిషం, 43వ నిమిషం) గోల్స్ చేశారు. దక్షిణ కొరియా తరఫున నమోదైన ఏకైక గోల్ను జిహూన్ యాంగ్ (30వ నిమిషం) సాధించాడు. భారత్ శనివారం జరిగే చివరి గ్రూప్ మ్యాచ్లో పాకిస్థాన్తో తలపడనుంది. అంతకుముందు భారత్ 3-0తో చైనాను, 5-1తో జపాన్ను, 8-1తో మలేసియాను ఓడించింది. ఆరు జట్లు పోటీపడుతోన్న ఈ టోర్నీ రౌండ్ రాబిన్ ఫార్మాట్లో జరుగుతోంది. తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లు సెమీస్లో ప్రవేశిస్తాయి.



## ఓవర్సీస్‌లో భారత్ దూకుడు

● విరాట్ సారథ్యంతోనే మొదలైంది: రికీ పాంటింగ్ ● విదేశాల్లో భారత అద్భుత ప్రదర్శన వెనుక విరాట్ కోహ్లి ఉన్నాడు

ఢిల్లీ: గత కొన్నేళ్లుగా భారత్ విదేశాల్లో అద్భుతమైన ప్రదర్శన చేస్తోంది. దీనికి ప్రధాన కారణం దూకుడైన కెప్టెన్సీ. విరాట్ కోహ్లి తన సారథ్య కాలంలో ఇలానే ఉండేవాడు. అతడికి తోడుగా అప్పుడు రవిశాస్త్రి ప్రధాన కోచ్గా ఉన్నాడు. వీరిద్దరి హయాంలోనే భారత్ ఆసీస్ గడ్డపై అద్భుత విజయాలు నమోదు చేసింది. ఆసీస్ను వారి దేశంలో ఓడించిన తొలి ఆసియా జట్టుగా టీమ్ఇండియా ఘనత సాధించింది. ఆ తర్వాత ఇంగ్లండ్ను కూడా ఓడించింది. ఇప్పుడు గౌతమ్ గంభీర్ - రోహిత్ శర్మ ఇదే దూకుడు కలిగిన ద్వయమే. అయితే, కోహ్లి కెప్టెన్సీ నుంచే భారత్ విదేశాల్లో నిర్భయంగా ఆడేస్తోందని ఆసీస్ మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ వ్యాఖ్యానించాడు. ఐపీఎల్ కూడా భారత క్రికెట్లో కీలక పాత్ర పోషించినట్లు పేర్కొన్నాడు. భారత్ గబ్బాలో అద్భుత విజయం సాధించింది. ఇది గతంలో ఎప్పుడూ జరగలేదు. వారి బ్యాటర్లు పరిస్థితులను త్వరగా అర్థం చేసుకొని ఆడారు. ఆ తర్వాత సిరీసుల్లోనూ గెలిచారు. బిగ్ మ్యాచ్లో నిర్భయంగా ఆడటం అలవర్చుకున్నారు. దీనింతటికి విరాట్ కోహ్లి కెప్టెన్సీతోపాటు ఐపీఎల్ లో కీలక పాత్ర పోషించాయి. గత పదేళ్లుగా నేను ఐపీఎల్ను దగ్గర నుంచి గమనిస్తూనే ఉన్నా. కుర్రాళ్లు దూకుడుగా ఆడేస్తున్నారు. తీవ్ర ఒత్తిడి ఉండే ఐపీఎల్ వంటి టోర్నీల్లో రాణించడం సాధారణ విషయం కాదు. ఒక్కసారి విఫలమైనా ఏమాత్రం వెనక్కి అడుగు వేయడం లేదు. అదేవిధంగా స్పిన్నర్ల కార్ఖానాగా ఉండే భారత్లో పేసర్లు ఎక్కువ మంది తయారుకావడం కూడా ఆ జట్టుకు కలిసొచ్చే అంశం.

విరాట్ కోహ్లి నాయకత్వంలో పేస్ను చాలా బాగా ప్రోత్సహించాడు. భారత క్రికెట్ టర్నింగ్ కావడంలో అతడూ కీలక పాత్ర పోషించాడు. రవిశాస్త్రితో కలిసి దూకుడు మంత్రం ప్రదర్శించాడు. ఆ తర్వాత భారత కోచ్గా ఉన్నప్పుడు రాహుల్ ద్రవిడ్ దానిని కొనసాగించాడు. కోహ్లి వంటి ప్లేయర్ జట్టులో ఉంటే చాలా ప్రభావం చూపిస్తుంది. ఆటగాళ్లలో జోష్ తెప్పించడంతోపాటు నిర్భయంగా ఆడే లక్షణం అలవడుతుంది అని పాంటింగ్ వ్యాఖ్యానించాడు. బోర్డర్ - గావస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియా - భారత్ జట్ల మధ్య నవంబర్ రెండో వారం నుంచి ఐదు టెస్టుల సిరీస్ జరగనుంది.

**అరుదైన ఘనతకు దగ్గరగా విరాట్..** : బంగ్లాదేశ్తో సెప్టెంబర్ 19 నుంచి భారత్ రెండు టెస్టుల సిరీస్ను ఆడనుంది. ఈ క్రమంలో విరాట్ కోహ్లి ఓ అరుదైన ఘనతకు చేరువగా ఉన్నాడు. అంతర్జాతీయ క్రికెట్లో అత్యంత వేగంగా 27వేలకు పైగా పరుగులు చేసిన బ్యాటర్గా నిలిచే అవకాశం కోహ్లి ముంగిట ఉంది. మరో 58 పరుగులు చేస్తే ఈ ఘనతను సాధిస్తాడు. సచిన్ 623 ఇన్నింగ్స్లో 27 వేల పరుగులు చేయగా.. కోహ్లి 591 ఇన్నింగ్స్లో 26,942 పరుగులతో ఉన్నాడు. బంగ్లాతో టెస్టు సిరీస్లో మిగిలిన పరుగులను రాబడితే తొలి బ్యాటర్గా విరాట్ నిలుస్తాడు. ఓవరాల్గా 27వేలు కంటే ఎక్కువ పరుగులు చేసిన ఆటగాళ్లు ఇప్పటి వరకు ముగ్గురే ఉన్నారు. సచిన్ (34,357) అగ్రస్థానంలో ఉండగా.. కుమార సంగక్కర (28,016), రికీ పాంటింగ్ (27,483) తర్వాత స్థానాల్లో కొనసాగుతు న్నారు. ఈ ఏడాదే పాంటింగ్ను అధిగమించే అవకాశం కూడా కోహ్లి ముంగిట ఉంది.

### మాట నిలబెట్టుకున్న క్రికెటర్
## బాధిత కుటుంబానికి ప్రైజ్‌మనీ

ఢాకా: బంగ్లాదేశ్ యువ క్రికెటర్ మెహిదీ హసన్ మిరాజ్ మాట నిలబెట్టుకున్నాడు. ఈమధ్య స్వదేశంలో చెలరేగిన అల్లర్లలో బలైన ఓ రిక్షా కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సాయం చేశాడు. పాకిస్థాన్తో టెస్టు సిరీస్లో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్గా వచ్చిన ప్రైజ్మనీ మొత్తాన్ని బాధితుడి ఫ్యామిలీకి ఇచ్చి ఉదారత చాటుకున్నాడు. గురువారం మృతుడి కుటుంబసభ్యులను ఓదార్చిన మిరాజ్.. రూ.5 లక్షల చెక్కు వాళ్లకు అందజేశాడు.గత నెలలో ఆన్లైన్లో వైరల్ అయిన వీడియో నా కంటపడింది. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా విద్యార్థులు చేపట్టిన ఉద్యమం ఆందోళనకరంగా మారి అల్లరిమూకల దాడిలో ఓ రిక్షా కార్మికుడు ప్రాణాలు విడిచాడు. అతడి కుమారుడు భోరున ఏడుస్తున్న ఆ వీడియో నన్ను ఆలోచనల్లో పడేసింది. ఆ సోదరుడి కుటుంబానికి అండగా నిలవాలనుకున్నా. ప్లేయర్ ఆఫ్ ది సిరీస్గా వచ్చిన డబ్బును వాళ్లకు ఇచ్చేస్తానని పాకిస్థాన్లో ఉండగానే ప్రామిస్ చేశాను.అనుకున్నట్టుగానే నిన్న రాత్రి నా మాట నిలబెట్టుకున్నా. బాధిత కుటుంబాన్ని కలిసి వాళ్లకు నా ప్రైజ్మనీ మొత్తాన్ని అప్పగించాను. ఇలా చేయడంతో చనిపోయిన వ్యక్తి లోటును పూడ్చలేనని తెలుసు. కానీ, వాళ్ల జీవితం ఎంతో కొంత సాఫీగా సాగేందుకు నా ప్రయత్నం ఉపయోగపడనుంది అని మిరాజ్ తెలిపాడు. సదరు రిక్షా కార్మికుడి కుటుంబంతో ఉన్న ఫొటోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. అది చూసిన అభిమానులు మిరాజ్.. నీ ఆటే కాదు మనసు కూడా బంగారమే అంటూ అతడిపై ప్రశంసలు కురిపిస్తున్నారు.

## దులీప్ ట్రోఫీలోకి ఇషాన్ కిషన్



ముంబయి: దేశవాళీలో ఆడనని మొండికేసిన ఇషాన్ కిషన్ బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్ట్ను కోల్పోయిన సంగతి తెలిసిందే. జాతీయజట్టులోకి రావాలంటే డొమెస్టిక్ ఆడాల్సిందేనని బీసీసీఐ అల్టిమేటం విధించింది. దీంతో బుచ్చిబాబు టోర్నీలో ఇషాన్ కిషన్ ఆడాడు. నాణ్యమైన ఇన్నింగ్స్తో ఆకట్టుకున్నాడు. దీంతో అతడిని దులీప్ ట్రోఫీలోనూ తీసుకోవాలని సోషల్ మీడియా వేదికగా ఇషాన్ను వెనక్కి తీసుకురండి ట్రెండింగ్ మొదలైంది. ఇప్పుడు రెండో రౌండ్ మ్యాచ్లు జరుగుతున్నాయి. అనూహ్యంగా బీసీసీఐ అతడిని దులీప్ ట్రోఫీలోకి తీసుకుంది. కానీ, దులీప్ ట్రోఫీ మొదటి రౌండ్ మ్యాచ్లకు అతడిని తీసుకోకపోవడానికి గాయం కారణమంటూ బీసీసీఐ పేర్కొనడం గమనార్హం. ఇషాన్ను దులీప్ ట్రోఫీలోకి తీసుకోవడం వెనక భారత జట్టు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ ఒత్తిడి మేరకు బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అద్భుతమైన నైపుణ్యం కలిగిన క్రికెటర్లను ప్రోత్సహించడంలో గంభీర్ ముందుంటాడు. దీంతో ఇండియా తరఫున ఇషాన్ బరిలోకి దిగాడు. ఆ జట్టుకు సారథి రుతురాజ్ గైక్వాడ్. ఇప్పటికే తమ తొలి మ్యాచ్లో విజయం సాధించింది. తొలుత ఇండియా జట్టులో అతడికి చోటు కల్పించిన బీసీసీఐ రివైజ్డ్ చేసిన జాబితాలో ఇండియా తరఫున అవకాశం కల్పించింది. ఇండియా జట్టులో సంజూశాంసన్ ఉండటంతో ఇద్దరు వికెట్ కీపర్లను ఒకే వైపు ఉండకుండా ఇలా నిర్ణయం తీసుకుంది. ఆర్యన్ జుయల్ స్థానంలో ఇషాన్ను బరిలోకి దింపింది. ఒకవేళ ఇందులోనూ రాణిస్తే సెంట్రల్ కాంట్రాక్ట్ పునరుద్ధరణ చేసే అవకాశం లేకపోలేదు. అప్పుడు మళ్లీ జాతీయ జట్టు తరఫున ఆడొచ్చు. ఇషాన్ను తొలి రౌండ్కు తీసుకోకపోవడంపై భారత బోర్డు ఇప్పటికే ఓ ప్రకటన జారీ చేసింది. వికెట్ కీపర్ - బ్యాటర్ ఇషాన్ కిషన్ను దులీప్ ట్రోఫీ మొదటి రౌండ్ మ్యాచ్లకు ముందు గజ్జల్లో గాయం కారణంగా తీసుకోలేదు. బుచ్చిబాబు టోర్నీ సమయంలో ఇబ్బంది పడ్డాడు. బీసీసీఐ మెడికల్ టీమ్ నిరంతరం పర్యవేక్షిం చింది. అతడు త్వరగా కోలుకొనేందుకు శ్రమించింది అని పేర్కొంది. ఇప్పుడు రెండో రౌండ్ మ్యాచ్లకు ఎంపి క చేయడంపై అభిమానులు సంతోషం వ్యక్తంచేశారు.

### 4,4,6,6,6,4
## ఒకే ఓవర్‌లో 30 పరుగులు

● ఇంగ్లాండ్‌కు చుక్కలు చూపించిన ట్రావిస్ హెడ్
● తొలి టీ20 మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 28 పరుగుల తేడాతో విజయం
● మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో ఆస్ట్రేలియా



సౌతాంప్టన్: ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ మధ్య జరుగుతున్న టి20 సిరీస్లో మొదటి మ్యాచ్ బుధవారం సౌతాంప్టన్లో జరిగింది. ఇందులో కంగారూ జట్టు మొదటి టి20 మ్యాచ్లో ఆతిథ్య ఇంగ్లాండ్ను 28 పరుగుల తేడాతో ఓడించింది. ఈ మ్యాచ్లో టాస్ గెలిచిన ఇంగ్లాండ్ జట్టు ముందుగా బౌలింగ్ ఎంచుకుంది.

జేమీ ఓవర్టన్, జాకబ్ బెథాన్ మరియు జోర్డాన్ కాక్స్ ఇంగ్లండ్ తరఫున తమ టి20 అంతర్జాతీయ కెరీర్ను ప్రారంభించారు. ఈ మ్యాచ్లో తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా జట్టు పవర్ ప్లేలో 86 పరుగులు చేసింది. ట్రావిస్ హెడ్, మాథ్యూ షార్ట్ జట్టుకు శుభారంభం అందించారు. కంగారూ జట్టు 19.3 ఓవర్లలో 179 పరుగులకు ఆలౌటైంది. ఆస్ట్రేలియా ఓపెనర్ ట్రావిస్ హెడ్ తుఫాను వేగంతో బ్యాటింగ్ చేసి హాఫ్ సెంచరీ (59) సాధించాడు. ఈ నేపథ్యంలో సామ్ కరన్ వేసిన ఒక ఓవర్లో 30 పరుగులు చేశాడు. ఇన్నింగ్స్ ఐదో ఓవర్ వేయడానికి వచ్చిన కరన్ బౌలింగ్లో ఆస్ట్రేలియా ఓపెనర్ ఆ ఓవర్లో వరుసగా 3 సిక్సర్లు, 3 ఫోర్లు కొట్టి 30 పరుగులు చేశాడు. అనంతరం చేదంకు వచ్చిన ఇంగ్లాండ్ జట్టు 19.2 ఓవర్లలో కేవలం 151 పరుగులకే కుప్పకూలింది. తద్వారా తొలి టీ20 మ్యాచ్లో ఆస్ట్రేలియా 28 పరుగుల తేడాతో విజయం సాధించి మూడు మ్యాచ్ల సిరీస్లో 1-0 ఆధిక్యంలో నిలిచింది. ప్లేయర్ అఫ్ ది మ్యాచ్ గా ట్రావిస్ హెడ్ నిలిచాడు.

సూర్య cinema@suryaa.com
విజయవాడ
శుక్రవారం
13 సెప్టెంబర్ 2024


# సూర్య సినిమా

## మట్కా ఫైనల్ షెడ్యూల్



మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ మోస్ట్ యాంటిసిపేటెడ్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ 'మట్కా' షూటింగ్ శరవేగంగా సాగుతోంది. ఈ సినిమా షెడ్యూల్ హైదరాబాద్‌లోని ఆర్ ఎఫ్‌సిలో జరుగుతోంది. కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ షెడ్యూల్‌తో సినిమా షూటింగ్ పార్ట్ మొత్తం పూర్తవుతుంది. కరుణ కుమార్ దర్శకత్వంలో వైర ఎంటర్‌టైన్‌మెంట్స్, ఎస్ఆర్‌టి ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి మూవీని మ్యాసీవ్ స్కేల్‌లో నిర్మిస్తున్నారు. పీరియాడికల్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ సినిమాలో వరుణ్ తేజ్ డిఫరెంట్ మేకోవర్‌లలో కనిపించనున్నారు. ఇటీవలే విడుదలైన వరుణ్ ఫస్ట్ లుక్ పోస్టర్ కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు సాఫీగా సాగుతున్నాయి. మేకర్స్ అనౌన్స్ చేసినట్లుగా చాలా ఎక్సయిటింగ్ అప్‌డేట్‌లతో రాబోతున్నాయి.

## 'బంధీ' టీజర్ లాంచ్



డిఫరెంట్ కాన్సెప్ట్, కంటెంట్ చిత్రాలను చేస్తున్న ఆదిత్య ఓం నుంచి బంధీ అనే సినిమా త్వరలోనే రాబోతోంది. గల్లీ సినిమా బ్యానర్ మీద ఈ మూవీని వెంకటేశ్వర రావు దగ్గు, తిరుమల రఘు నిర్మిస్తుండగా.. తిరుమల రఘు దర్శకత్వం వహించారు. తాజాగా ఈ చిత్రం నుంచి టీజర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో.. దర్శక నిర్మాత రఘు తిరుమల మాట్లాడుతూ.. 'ఇది నాకు మొదటి చిత్రం. ఈ ప్రయాణంలో ఎన్నో నేర్చుకున్నాను. ఆదిత్య ఓం సపోర్ట్ వల్లే ఈ మూవీని చేయగలిగాను. ఆయన ద్వారా ఎంతో నేర్చుకున్నాను. సినిమాలో కేవలం ఒక్క కారెక్టరే ఉంటుంది. ఆదిత్య వర్మ అనే పాత్రతోనే ఈ మూవీ ఉంటుంది. ప్రకృతిని నాశనం చేస్తున్న కార్పోరేట్ కంపెనీలకు సపోర్ట్ చేసే పాత్రలో ఆదిత్య కనిపిస్తారు. అలాంటి లీగల్ అడ్వైజర్ పాత్రని అడవిలో వదిలేస్తే ఏం జరుగుతుంది? అనేది ఆసక్తికరంగా ఉంటుంది. ప్రకృతిని ఎలా కాపాడుతాడు? అన్నది చివరకు చూస్తారు. కరోనా తరువాత ప్రకృతి మీద అందరికీ అవగాహన ఏర్పడింది. అందుకే ఈ కథను రాసుకున్నాను. ఆదిత్య ఓం ఎంతో ఒదిగి ఉండేవారు. టీంతో ఎంతో బాగా ఉండేవారు. మూడేళ్లలో ఆయన్ను చాలా దగ్గర్నుండి చూశాను. ఆరేడు నెలల క్రితమే షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం కొంత పని జరుగుతోంది. ఆదిత్య గారు సినిమాలో ఎక్కడా కూడా డూప్ వాడనివ్వలేదు. సొంతంగా యాక్షన్ సీక్వెన్స్ చేశారు. ఆయన ఇప్పుడు బిగ్ బాస్ షోలో ఉన్నారు. పంచభూతాలతో అడవిలో మమేకమై ఉన్నారు. ఇప్పుడు బిగ్ బాస్ షోతో భిన్నమనస్త్వాలు కూడిన మనుషులతో కలిసి ఉన్నాడు. సక్సెస్ అయి వస్తాడని ఆశిస్తున్నాను' అని అన్నారు.

## "క"లో రాధ క్యారెక్టర్ ఫస్ట్ లుక్



యంగ్ టాలెంటెడ్ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న భారీ పీరియాడిక్ థ్రిల్లర్ సినిమా "క". ఈ సినిమాలో నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. శ్రీమతి చింతా వరలక్ష్మి సమర్పణలో శ్రీచక్రాస్ ఎంటర్ టైన్ మెంట్స్ తో బ్యానర్ పై చింతా గోపాలకృష్ణ రెడ్డి భారీ ప్రొడక్షన్ వ్యాల్యూస్ తో నిర్మిస్తున్నారు. దర్శక ద్వయం సుజీత్, సందీప్ విలేజ్ బ్యాక్ డ్రాప్ యాక్షన్ థ్రిల్లర్ కథతో "క" సినిమాను రూపొందిస్తున్నారు. ఈ సినిమాను త్వరలో తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు తీసుకురాబోతున్నారు. "క" సినిమాను తెలుగులో ప్రొడ్యూసర్ వంశీ నందిపాటి, మలయాళంలో హీరో దుల్కర్ సల్మాన్ తన వేఫరర్ ఫిలింస్ పై రిలీజ్ చేయబోతున్నారు. తాజాగా "క" సినిమా నుంచి బ్యూటిఫుల్ హీరోయిన్ తన్వీ రామ్ నటిస్తున్న రాధ క్యారెక్టర్ ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్ లో ట్రెడిషినల్ లుక్‌లో దాండియా ఆడుతూ అందంగా కనిపిస్తూ ఆకట్టుకుంటోంది తన్వీరామ్. ఆమె చేస్తున్న రాధ క్యారెక్టర్ కు "క" సినిమాలో మంచి ఇంపార్టెన్స్ ఉండనుంది.

## 'నువ్వే నాకు లోకం...' రిలీజ్



*'ఓసారైనా చూడవే ఉండిపోవే ఉండిపోవే..*
*వింటావా నా మాటనే ఉండిపోవే ఉండిపోవే..*
*మనసే ఇరుకై నలిగా నేనే*
*గదిలో నువ్వు లేక*
*నిదుర కుదురు చెదిరిపోయే*
*నువ్విలా వదిలాక'*

అంటూ దూరమైన భార్యపై తన ప్రేమను వ్యక్తం చేస్తున్న భర్త మనసులోని బాధ, ప్రేమ ఏంటో తెలుసుకోవాలంటే 'జనక అయితే గనక..' సినిమా చూడాల్సిందేనంటున్నారు మేకర్స్. వెర్సటైల్ యాక్టర్ సుహాస్, సంగీర్తన హీరో హీరోయిన్లుగా రూపొందిన చిత్రం 'జనక అయితే గనక'. శిరీష్ సమర్పణలో దిల్‌రాజు ప్రొడక్షన్స్ పతాకంపై హర్షిత్ రెడ్డి, హన్షిత రెడ్డి నిర్మించారు. సందీప్ రెడ్డి బండ్ల డైరెక్ట్ చేశారు. ఈ సినిమాను దసరా సందర్భంగా అక్టోబర్ 12న విడుదల చేస్తున్నారు. బలగం వంటి ఎమోషనల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను అందించిన దిల్ రాజు ప్రొడక్షన్స్ నుంచి మరోసారి అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామాగా 'జనక అయితే గనక' విడుదలవుతుంది.

## మేకర్స్‌కు మహేష్ రిక్వెస్ట్

టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు.. 2024లో సంక్రాంతికి గుంటూరు కారం మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ దర్శకత్వం వహించిన ఆ సినిమా.. మిక్స్ డ్ టాక్ అందుకున్నా భారీ వసూళ్లను సాధించింది. అయితే మహేష్ తన నెక్స్ట్ మూవీ దర్శక ధీరుడు రాజమౌళితో చేయనున్నారు. ఆ భారీ ప్రాజెక్ట్ నుంచి అఫీషియల్ గా ఎలాంటి అనౌన్స్‌మెంట్స్ రాకపోయినా.. ఏదో ఒక వార్త వైరల్ అవుతూనే ఉంటోంది. అయితే ఈ సినిమా కోసం మహేష్ బాబు.. భారీగా మేకోవర్ చేసుకుంటున్నట్లు ఇపప్పటికే క్లారిటీ వచ్చేసింది. లాంగ్ హెయిర్, గుబురు గడ్డంతో ఇప్పటికే అనేక సార్లు కనిపించారు. దీంతో మహేష్‌బాబు 29వచిత్రంలో ఇప్పటి వరకు ఎన్నడూ చూడని లుక్ లో సందడి చేయనున్నట్లు అర్థమవుతోంది. అమెజాన్ అడవుల నేపథ్యంలో సాగే ఆ సినిమా.. పాన్ ఇండియా లాంగ్వేజెస్ తో పాటు విదేశీ భాషల్లో కూడా విడుదల అవ్వనుంది. దుర్గా ఆర్ట్స్ పై నిర్మాత కేఎల్ నారాయణ భారీ బడ్జెట్ తో రూపొందించనున్నారు. అయితే ఇప్పుడు సోషల్ మీడియాలో ఇంట్రెస్టింగ్ న్యూస్ చక్కర్లు కొడుతోంది. మహేష్ బాబు.. ఇప్పటి వరకు ఒక్క బాలీవుడ్ మూవీలో కూడా నటించలేదన్న విషయం తెలిసిందే. దీంతో రాజమౌళి తీయబోయే సినిమాతోనే బీటౌన్ లోకి ఎంట్రీ ఇవ్వాలని మన సూపర్ స్టార్ నిర్ణయం తీసుకున్నట్లు ఇండస్ట్రీలో గుసగుసలు వినిపిస్తున్నాయి. అందుకే తాను ఇప్పటికే నటించిన సినిమాలను హిందీలోకి డబ్ చేయవద్దని ఆయా చిత్రాల నిర్మాతలను మహేష్ కోరారట. ఇప్పుడు ఈ విషయంలో నెట్టింట తెగ వైరల్ అవుతోంది. అయితే మహేష్ బర్త్ డే రోజు.. రాజమౌళి ఏదైనా అప్‌డేట్ ఇస్తారేమోనని ఫ్యాన్స్ ఎంతగానో ఎదురు చూశారు. ఆ రోజు ఎలాంటి అప్‌డేట్ రాలేదు. దీంతో నిరాశ చెందారు. కానీ తమ ఫేవరెట్ హీరో.. పాన్ వరల్డ్ రేంజ్‌లో సందడి చేయనున్నారని ఖుషీ అవుతున్నారు.




## మనుషుల్లో దేవుడు చంద్రన్న పాట ఆవిష్కరణ



విజయవాడ నగరంలో వరద సృష్టించిన విధ్వంసంలో ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు అందించిన నిరుపమాన సేవలు యావత్ దేశాన్ని ఆశ్చర్యపరిచాయి. చంద్రబాబు నాయుడు అవిరళ కృషి, అసమాన పట్టుదల చూసి ఒక స్ఫూర్తివంతమైన పాటను రచించానని గుమ్మడి గోపాలకృష్ణ తెలిపాడు . "మనుషుల్లో దేవుడు చంద్రన్న" అన్న ఈ పాటను నిర్మాత కె .ఎస్ .రామారావు ఆవిష్కరించారు . మాదాపూర్లో జరిగిన ఒక కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలుగు దేశం పార్టీ రాజకీయ కార్యదర్శి, ఎన్టీఆర్ సెంటినరీ కమిటీ చైర్మన్ టి.డి.జనార్దన్ మాట్లాడుతూ – ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అవిశ్రాంత యోధుడు, ప్రజలకోసం పనిచేసే నాయకుడు, విజయవాడ ప్రజల ఇక్కట్లను, కన్నీటి గాధలను స్వయంగా చూసి, వయసును కూడా మర్చిపోయి రాత్రి, పగలు సేవలు అందించారు. ఆ సేవలకు స్పందించిన గుమ్మడి గోపాలకృష్ణ రాసి, గానం చేసి, స్వర పరచిన ఈ పాట ఎంతో స్ఫూర్తిదాయకంగా వుంది అన్నారు. నిర్మాత రామారావు మాట్లాడుతూ – గుమ్మడి గోపా లకృష్ణ తయారు చేసిన ఈ పాట ఎంతో ఆర్ధవతంగా, సహ జంగా వుంది, చంద్రబాబునాయుడుగారి లాంటి ముఖ్యమంత్రి మన రాష్ట్రానికి ఉండటం అదృష్టం. ఆయన సేవలతో విజయవాడ నగరం త్వరంగా తేరుకుంది అని చెప్పారు.

## 'భలే ఉన్నాడే' ఫ్యామిలీ అంతా కలిసి చూడదగ్గ సినిమా : డైరెక్టర్ మారుతి



యంగ్ హీరో రాజ్ తరుణ్ న్యూ ఏజ్ ఎంటర్ టైనర్ 'భలే ఉన్నాడే'. రవికిరణ్ ఆర్ట్స్ బ్యానర్‌పై ఎన్‌వి కిరణ్ కుమార్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి జె శివసాయి వర్ధన్ డైరెక్టర్. బ్లాక్ బస్టర్ మేకర్ మారుతి ఈ చిత్రాన్ని ప్రజెంట్ చేస్తున్నారు. మనీషా కంద్కూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రంలో సీనియర్ హీరోయిన్ అభిరామి కీలక పాత్రలో కనిపిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఈ టీజర్, ట్రైలర్ సాంగ్స్ కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. సెప్టెంబర్ 13న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రీ రిలీజ్ ఈవెంట్ గ్రాండ్‌గా జరిగింది. డైరెక్టర్ మారుతి మాట్లాడుతూ.. 'భలే ఉన్నాడే'తో టీమ్ అంతా ఏడాదిన్నరగా జర్నీ అవుతున్నారు. ఈ సినిమాతో అందరికీ ఒక ఎమోషనల్ కనెక్షన్ ఉంది. సినిమా ఎప్పుడు రిలీజ్ అవుతుందా అనే ఎక్సైట్ మెంట్ తో అందరూ వర్క్ చేశారు. ఈ సినిమాతో ఒక కొత్త టీం స్క్రీన్ మీదకు రావడం చాలా హ్యాపీగా ఉంది. డైరెక్టర్‌గా శివ సాయి, హీరోయిన్‌గా మనీషా, ప్రొడ్యూసర్‌గా కిరణ్, ఇలా కొత్త టీం పరిచయం అవుతున్నారు. డెఫినెట్‌గా ఈ సినిమా డిసప్పాయింట్ చేయదు. ఎప్పుడో వచ్చిన ఒక థాట్ ని సాయికి చెప్తే దాన్ని చాలా అద్భుతంగా మలిచి ఈ సినిమాని చేశాడు. ఇలాంటి పాయింట్ ని ఫ్యామిలీ అంతా చూసే విధంగా మలిచాడు. నేను సలహాలు ఇవ్వడం వరకే గాని నిజానికి కష్టపడిందంతా టీమే. నిర్మాతలు చాలా ఇష్టంతో ఈ సినిమా చేశారు. చాలా మంచి టీం ఇది. వీళ్ళ కష్టానికి తగిన ఫలితం మంచి హిట్ ద్వారా వస్తుందని బలంగా కోరుకుంటున్నాను. ఈ సినిమాలో కథ మాటలు సాంగ్స్ డైలాగ్స్ ఎమోషన్స్ అన్ని పక్కాగా కుదిరాయి. మంచి మెసేజ్ కూడా ఉంటుంది. ప్రజెంట్ జనరేషన్‌లో ఈ ప్రాబ్లం ఉంది.

## తెలుగు రాష్ట్రాల్లో వరద బాధతుల సహాయార్థం ప్రొడ్యూసర్స్ అసోసియేషన్



భారీ వర్షాలు, వరదలతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆస్తి, ప్రాణ నష్టంతో బాధపడుతున్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో వారికి అండగా నిలబడేందుకు ముందుకొచ్చారు తెలుగు టెలివిజన్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ సభ్యులు. తెలుగు రాష్ట్రాల్లోని వరద బాధితులకు తమ వంతు ఆర్థిక సహాయం ప్రకటించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ ఫిలింఛాంబర్‌లో పాత్రికేయ సమావేశం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు టీవీ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు. నటుడు, నిర్మాత ప్రభాకర్ మాట్లాడుతూ – తెలుగు రాష్ట్రాల్లోని ప్రజలు వరదల కారణంగా సర్వస్వం కోల్పోయారు. ఈ వరదలకు సంబంధించిన వార్తలు చూస్తున్నప్పుడు చాలా బాధగా అనిపించింది. వరద బాధితులను ఆదుకునేందుకు మన నాయకులు ఎంతో కష్టపడుతున్నారు. మమ్మల్ని ఆదరిస్తున్న ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు మా వంతు సహాయం చేయాలని అనుకున్నాం. మా తెలుగు టెలివిజన్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ప్రసాద్ రావు గారితో మాట్లాడి సీరియల్స్ నిర్మించే ప్రతి ప్రొడ్యూసర్ తమకు చేతనైనంత విరాళం ఇవ్వాలని కోరాం. అందరూ సహృదయంతో స్పందించారు. తమకు వీలైనంత సాయం చేశారు. మేము గతంలో కరోనా టైమ్ లో కూడా సహాయ కార్యక్రమాలు చేశాం. ఇకపైనా సందర్భం వచ్చినప్పుడు తప్పకుండా ముందుకొస్తాం. మాకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు చెబుతున్నాం అన్నారు.

## నా కెరీర్ లో మోస్ట్ సాటిస్ఫైయింగ్ ఫిల్మ్ మా నాన్న సూపర్ హీరో: సుధీర్ బాబు



నేచురల్ స్టార్ నాని లాంచ్ చేసిన నవ దళపతి సుధీర్ బాబు, అభిలాష్ రెడ్డి కంకర, వి సెల్యులాయిడ్స్, కామ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ 'మా నాన్న సూపర్ హీరో' హార్ట్ వార్మింగ్ టీజర్‌ను– అక్టోబర్ 11న థియేట్రికల్ రిలీజ్ నవ దళపతి సుధీర్ బాబు హోల్సమ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'మా నాన్న సూపర్ హీరో'తో అలరించబోతున్నారు. అభిలాష్ రెడ్డి కంకర దర్శకత్వంలో కామ్ ఎంటర్‌టైన్‌మెంట్, వి సెల్యులాయిడ్స్ బ్యానర్‌పై సునీల్ బలుసు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మేకర్స్ ఇటీవల ఫస్ట్–లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేసి ప్రమోషన్స్ ప్రారంభించారు. నేచురల్ స్టార్ నాని ఈ సినిమా టీజర్‌ను లాంచ్ చేశారు. తన తండ్రితో సుధీర్ బాబుకు ఉన్న డీప్ ఎమోషనల్ బాండ్ ని టీజర్ అద్భుతంగా ప్రజెంట్ చేసింది. సుధీర్ బాబు సాయాజీ షిండే, సాయిచంద్ ఇద్దరినీ నాన్న అని పిలుస్తుంటాడు. సాయాజీ షిండే పాత్ర అతని పట్ల అయిష్టత చూపిస్తుండగా, సాయి చంద్ పాత్ర సుధీర్ బాబుతో మంచి అనుబంధం వుంటుంది. తన కొడుక్కి క్యాన్సర్ ఉందనే నెపంతో తన తండ్రి ఒకరి దగ్గర డబ్బు తీసుకున్నాడని తెలిసి సుధీర్ బాబు పాజిటివ్‌గా రెస్పాండ్ అవ్వడంతో టీజర్ ఆకట్టుకునేలా ముగిసింది.



## మలైకా ఇంటి పేరుపై కన్ ఫ్యూజన్

మలైకా అరోరా తండ్రి ఇంటిపేరుపై గందరగోళం నెలకొందా? ఒకరు అరోరా అంటే? మరొకరు మోహతా అంటున్నారు. నిన్నటి రోజున మలైకా అరోరా తండ్రి అనీల్ ఆరోరా ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. మరాణానంతరం అతడి పేరు అనీల్ అరోరాగా తెరపైకి వచ్చింది. అయితే మలైకా అరోరా తండ్రిని అనీల్ మోహతా కులదీప్ మెహతగా నెట్టింట చర్చనీయాంగా మారింది. ఓ యూజర్ మలైకా ఇంటి పేరు అరోరా అని... ఆమె తండ్రి ఇంటి పేరు మెహతా అని రాసుకొచ్చారు. మరొకరు అనీల్ మలైకాకి సవతి తండ్రి అని అనుమానం వ్యక్తం చేసారు. ఈ నేపథ్యంలో మలైకా...అనీల్ మధ్య వయసు వ్యత్యాసాన్ని కూడా ఎత్తి చూపారు. ఇద్దరి మధ్య కేవలం 12 ఏళ్లు వ్యవధి మాత్రమే ఉంది. అనీల్ వయసు 62 కాగా...మలైకా అరోరా వయసు 50 ఏళ్లు. సవతి తండ్రి కావడంతో ఈ వ్యత్యాసం అని అంటున్నారు. సన్నిహిత వర్గాలు సైతం మలైకాకి అనీల్ సవతి తండ్రిగానే చెబుతున్నాయి. మలైకా మహారాష్ట్రలోని థానేలో జన్మించింది. ఆమె 11 సంవత్సరాల వయస్సులో ఆమె తల్లిదండ్రులు విడాకులు తీసుకున్నారు. మలైకా తల్లి , సోదరి అమృతా కలిసి చెంబూర్‌కు వెళ్లిపోయారు. ఆమె తల్లి జాయిస్ పాలీకార్ప్. ఆమె ఒక మలయాళీ క్రిస్టియన్. తండ్రి అనిల్ అరోరా పంజాబీ కుటుంబానికి చెందిన వ్యక్తి. ఇండియన్ మర్చంట్ నేవీ ఉద్యోగి.

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044.